నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 6-9-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక:30 | పేజీలు: 4 | వెల: రూ.1/-

ఒకే రోజు అన్ని ప్రార్థనా మందిరాలకు శంకుస్థాపన చేస్తాం: సీఎం కేసీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 5: కొత్తగా నిర్మించే సెక్రటేరియట్‌లో మందిరం, మసీదులు, చర్చిని పూర్తిగా ప్రభుత్వ ఖర్చుతో నిర్మిస్తామని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు వెల్లడించారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత గంగా జమునా తహజీబ్‌కు అద్దం పట్టేలా ఒకే రోజు అన్ని ప్రార్థనా మందిరాలకు శంకుస్థాపన చేసి, త్వరితగతిన నిర్మాణం పూర్తి చేస్తామని వెల్లడించారు. కొత్త సెక్రటేరియట్ లో మసీదుల నిర్మాణం, ఇతర అంశాలపై ముస్లిం మత పెద్దలతో ముఖ్యమంత్రి ప్రగతి భవన్ లో ఇవాళ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలు అంశాలపై వారితో కూలంకషంగా చర్చించారు. వారి అభిప్రాయాలు, సూచనలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు:

-పాత సెక్రటేరియట్ భవనాలు కూల్చి వేస్తున్న సందర్భంలో అక్కడ ఉన్న మందిరం, రెండు మసీదులకు నష్టం వాటిల్లింది. వాటిని పూర్తి ప్రభుత్వ ఖర్చుతో అన్ని సౌకర్యాలతో నిర్మించాలని నిర్ణయించాం.

-ఒక్కొక్కటి 750 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇమామ్ క్వార్టర్ తో సహా రెండు మసీదులు (మొత్తం 1500 చదరపు అడుగులు) ప్రభుత్వం నిర్మిస్తుంది. పాత సెక్రటేరియట్ లో ఉన్న స్థలంలోనే మసీదుల నిర్మాణం జరుగుతుంది. నిర్మాణం పూర్తయిన తర్వాత మసీదులను వక్ఫ్ బోర్డుకు అప్పగిస్తుంది.

-1500 చదరపు అడుగుల విస్తీర్ణంలో మందిరం నిర్మాణాన్ని ప్రభుత్వం చేపడుతుంది. నిర్మాణం పూర్తయ్యాక దేవాదాయ శాఖకు మందిరాన్ని అప్పగిస్తుంది.

-కొత్త సెక్రటేరియట్ ప్రాంతంలో తమకు కూడా ప్రార్థనా మందిరం కావాలన్న క్రిస్టియన్ల కోరిక మేరకు చర్చిని కూడా ప్రభుత్వం నిర్మిస్తుంది.

-తెలంగాణ రాష్ట్రం అన్ని మతాలను సమానంగా ఆదరిస్తుంది. పరమత సహనం పాటిస్తుంది. గంగా జమునా తహజీబ్ కు ప్రతీక. అందుకే కొత్త సెక్రటేరియట్ లో అన్ని మతాల ప్రార్థనా మందిరాలు నిర్మిస్తాం. అసెంబ్లీ సమావేశాల తర్వాత అన్నింటికి ఒకే రోజు శంకుస్థాపన చేస్తాం.

- ముస్లిం అనాథ పిల్లలకు ఆశ్రయమిచ్చి, విద్య నేర్పించే అనీస్ ? ఉల్ ? గుర్బా నిర్మాణం వేగవంతం చేస్తాం. ఇప్పటికే 80 శాతం నిర్మాణం పూర్తయింది. మరో 18 కోట్లు అవసరమవుతాయి. వాటిని వెంటనే విడుదల చేసి, నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేస్తాం.

-అంతర్జాతీయ ప్రమాణాలతో హైదరాబాద్ నగరంలో ఇస్లామిక్ సెంటర్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం స్థలం కూడా కేటాయించింది. కరోనా పరిస్థితుల వల్ల నిర్మాణంలో జాప్యం జరుగుతున్నది. వెంటనే ఈ సెంటర్ నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

- హైదరాబాద్ నగరం చుట్టూ ఖబ్రస్థాన్ లు రావాల్సిన అవసరం ఉన్నది. స్థలాలు సేకరించాలని ఇప్పటికే రంగారెడ్డి, మేడ్చల్ కలెక్టర్లను కోరాం. వారు కొన్ని స్థలాలు గుర్తించారు. నగరంలోని వివిధ చోట్ల మొత్తం 150 నుంచి 200 ఎకరాల్లో ఖబ్రస్థాన్ లు ఏర్పాటు చేస్తాం.

-నారాయణపేటలో రోడ్ల వెడల్పు కార్యక్రమం సందర్భంగా పీరీల చావడి అయిన అసుర్ ఖానాకు నష్టం వాటిల్లింది. దీనికి స్థలం కేటాయించి, నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ ను ఆదేశించాం.

- రాష్ట్రంలో ఉర్దూను రెండవ అధికార భాషగా గుర్తిస్తున్నాం. ఉర్దూ భాష పరిరక్షణ, అభివృద్ధి కోసం కార్యక్రమాలు చేపడతాం. అందుకోసం అధికార భాష సంఘంలో ఉర్దూ భాషాభివృద్ధి కార్యక్రమాలు తీసుకుంటాం. అధికార భాష సంఘంలో ఉర్దూ భాషకు సంబంధించిన వ్యక్తిని ఉపాధ్యక్షులుగా నియమిస్తాం.

-ఈ సమావేశంలో హోం శాఖ మంత్రి మహమూద్ అలీ, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ మెంబర్ మౌలానా ముఫ్తీ ఖలీల్ అహ్మద్ సాహెబ్, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ సెక్రటరీ మౌలానా ఖలీద్ సైఫుల్లా రహ్మానీ, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ మెంబర్, మజ్లిస్ ఉలేమా ఇ డెక్కన్ ప్రెసిడెంట్ మౌలానా సయ్యద్ కుబూల్ బాద్ షా షట్తారి, మౌతమిమ్ దారుల్ ఉలూమ్ రహ్మానియా, ప్రెసిడెంట్ జామియత్ ఉలేమా ఇ హింద్ మౌలానా ముఫ్తీ ఘ్యాసుద్దీన్ రహ్మానీ, అమీర్ ఈ జామియా నిజాయా మౌలానా సయ్యద్ అక్బర్ నిజాముద్దీన్ హుస్సేనీ, అమీర్ ఇ జమాత్ ఈ ఇస్లామియా మౌలానా హమీద్ మొహమ్మీద్ ఖాన్ సాహెబ్, తామిర్ ఇ మిల్లత్ వైస్ ప్రెసిడెంట్ మౌలానా జియాఉద్దీన్ నాయ్యర్, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ మెంబర్, హైదరాబాద్ నాజిమ్ దారుల్ ఉలూమ్ మౌలానా రహీముద్దీన్ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో పెరుగుతున్న కరోనా కేసులు

హైదరాబాద్,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): తెలంగాణలో కరోనా కేసులు పెరుగుతూనే ఉన్నాయి. తాజాగా గడిచిన 24 గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా 2,511 కొత్త కేసులు నమోదైనట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ తెలిపింది. దాంతో ఇప్పటివరకు రాష్ట్రంలో 1,38,395 కేసులు నమోదయ్యాయి. తాజాగా శుక్రవారం కరోనా బారినపడి 11 మంది చనిపోయారు. దాంతో మొత్తం మరణాల సంఖ్య 877కు చేరింది. రాష్ట్రంలో కొత్తగా 2,579 మంది కరోనా నుంచి కోలుకొని డిశ్చార్జ్ అయ్యారు. దాంతో ఇప్పటివరకు డిశ్చార్జ్ అయిన వారిసంఖ్య 1,04,603గా ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో 32,915 కేసులు యాక్టివ్ గా ఉన్నట్లు తెలిపింది. మరో 25,729 కేసులు హోంఐసోలేషన్‌లో ఉన్నట్లు తెలిపింది. ఇక జిల్లాల్లో నమోదయిన కరోనా కేసుల విషయానికొస్తే.. జీహెచ్ఎంసీలో 305, రంగారెడ్డి 184, నల్గొండ 170, కరీంనగర్ 150, ఖమ్మం 142, మేడ్చల్ 134, వరంగల్ అర్బన్ 96, సూర్యపేట్ 96, భద్రాద్రి 93, నిజామాబాద్ 93, జగిత్యాల 85, సిద్ధిపేట్ 80, యాదాద్రి 78, మంచిర్యాల్ 73, రాజన్న సిరిసిల్ల 72, సంగారెడ్డి 70, పెద్దపల్లి 65, కామారెడ్డి 60, మహబూబా బాద్ 58 కేసులు నమోదైనట్లు ఆరోగ్యశాఖ తెలిపింది.

పెట్రోల్ బంకులపై ఎస్వోటి పోలీసుల దాడి

చిప్ అమర్చి జనాలకు టోపీ పెడుతున్న బంకులు

హైదరాబాద్‌లో 13,ఎపిలో 26 బంకుల సీజ్

సైబరాబాద్,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో అవకతవకలకు పాల్పడుతున్న పెట్రోల్ బంకులపై ఎస్వోటీ పోలీసులు దాడులు నిర్వహించారు. పెట్రోల్ తక్కువ వచ్చి, మీటర్ మాత్రం కరెక్ట్‌గా చూపించే విధంగా చిప్‌లను పెట్రోల్ బంక్ నిర్వాహకులు అమర్చి జనాలను మోసం చేస్తున్నారు. దీంతో రంగంలోకి దిగిన ఎస్వోటీ పోలీసులు హైదరాబాద్ పరిధిలోని 13 పెట్రోల్ బంకులను సీజ్ చేశారు. సైబరాబాద్ ఎస్వోటీ పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు ఆంధ్రప్రదేశ్‌లోని 26 బంక్‌లను ఏపీ పోలీసులు సీజ్ చేశారు. ప్రత్యేక చిప్‌లను బంకు యజమానులు మహారాష్ట్ర నుండి తెప్పించినట్లు తెలుస్తోంది. ఇది ఒక గ్యాంగ్‌గా ఏర్పడి ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నట్లు సైబరాబాద్ ఎస్వోటీ పోలీసులు గుర్తించారు. పెట్రోల్ బంకులలో మోసాలకు పాల్పడుతున్న 26 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముంబై నుండి ప్రత్యేకంగా చిప్‌లను తెప్పించుకున్న బంక్ నిర్వాకులు రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ పెట్రోల్ బంకులు అమర్చుకున్నారు. దీని ద్వారా కోట్ల రూపాయలను మోసం చేసినట్లు పోలీసు విచారణలో వెల్లడైంది. పెట్రోల్ తక్కువగా వచ్చినా.. మీటర్ మాత్రం కరెక్ట్‌గా చూపించే విధంగా చిప్‌లను అమర్చి వినియోగదారుల్ని మోసం చేస్తున్నారు. ఈ విధంగా కోట్ల రూపాయలను మోసం చేసినట్లు పోలీసు విచారణలో వెల్లడైంది.

హైదరాబాద్ డిఇవో కార్యాలయం ముందు ధర్నా

హైదరాబాద్,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, ప్రభుత్వ వైఖరికి నిరసనగా డీఈఓ కార్యాలయం ముందు తెలంగాణ ప్రైవేటు టీచర్స్ ఫోరం ఆందోళనకు దిగింది. సెప్టెంబర్ 5న టీచర్స్ డేను బ్లాక్‌డేగా ప్రైవేటు ఉపాధ్యాయులు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా హైదరాబాద్ డీఈఓ కార్యాలయం ముందు నల్లజెండాలు, నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనకు దిగారు. ప్రైవేట్ టీచర్లకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 45 ప్రకారం ప్రైవేటు టీచర్లకు, నాన్-టీచింగ్ సిబ్బందికి యాజమాన్యాలు పూర్తి వేతనం చెల్లించాలని ఉపాధ్యాయులు పట్టుబట్టారు. ప్రైవేట్ ఉపాధ్యాయుల కుటుంబాలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని.... ప్రైవేటు విద్యా సంస్థలను నియంత్రించడానికి ప్రభుత్వం ఒక రెగ్యులేటరీ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని.. ప్రభుత్వ ప్రైవేటు ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఇచ్చి సత్కరించాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ షబ్బీర్ అలీ డిమాండ్ చేసారు. ధర్నాలో వందలాదిగా ప్రైవేట్ టీచర్లు పాల్గొని నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా షబ్బీర్ మాట్లాడుతూ కరోనా వైరస్ కట్టడి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు లాక్ డౌన్ పాటిస్తున్నాము. కరోనా మహమ్మారి నుండి మన ప్రాణాలను కాపాడుకోవడానికి స్వీయ నిర్బంధమే

టీచర్స్‌డేను బ్లాక్ డేగా ప్రకటించి నిరసనలు

జీతాల కోసం రోడ్డెక్కిన ప్రైవేట్ టీచర్ల సంఘం

నివారణ. ఇదే సమయంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయులు , స్కూల్ తప్ప మరో ఆధారం లేకుండా పనిచేస్తున్న ఉపాధ్యాయులు జీతాలు వస్తాయో, రావో అనే ఆలోచనతో మనోవేదనకు గురౌతున్నారని అన్నారు. ఈ సందర్భంగా ప్రైవేట్ ఉపాధ్యాయులందరికీ పూర్తి విద్యా సంవత్సరం జీతాలు ఇవ్వాలనీ , ప్రైవేట్ యాజమాన్యాలకు టీపిటిఎఫ్ తరుపున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ప్రభుత్వంకూడా ప్రైవేట్ సంస్థలపై ఒత్తిడి తెచ్చి రోడ్డున పడ్డ టీచర్లను, ఇతర సిబ్బందికి జీతాలు ఇప్పించి ఆదుకోవాలని అన్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీవోను మరియు 1897 ఎపిడిమిక్స్ చట్టాన్ని పరగణలోకి తీసుకుని అందరికీ జీతాలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని యాజమాన్యాలు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి ఆదేశాలను పాటిస్తూ, మానవతా దృష్టితో ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వాలని కోరుతున్నాం. ఇలాంటి విపత్కర సమయంలో వారికి జీతాలను త్వరగా ఇస్తే వారికి ఆసరాగా ఉంటుందన్నారు. కొంతమంది యాజమాన్యాలు పిల్లల ఫీజులకు, ఉపాధ్యాయుల జీతాలకు ముడిపెడుతున్నారు. అది సరైంది కాదు. ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయ మిత్రులందరూ కలిసి ఐక్యంగా ఉండి,యాజమాన్యాలతో చర్చించి , సామరస్య ధోరణిలో జీతాల సమస్యను పరిష్కరించాలన్నారు. కాదంటే మనకున్న జీవోలు, చట్టాల ప్రకారం, విద్యాశాఖ అధికారులకు, మంత్రికి, ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేద్దామన్నారు. అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయించైనా సమస్యను పరిష్కరించాలన్నారు. ఇది ఎవరో ఒకరు చేస్తే అయ్యేది కాదని, అందరం ఐక్యంగా ఉండి సాధించుకోవాలి. మనం మనకు న్యాయంగా రావాల్సిన జీతాలు అడుగుతున్నం, వాటాలను అడుగడం లేదు. ఇలాంటి సమయంలో ఉపాధ్యాయులకు జీతాలు ఇచ్చి , వారి జీవితాలకు భరోసాగా నిలిచి తమ నీతి,నిజాయితీ, నిబద్ధత, మానవత్వం, సమాజం పట్ల అవగాహనను యాజమాన్యాలు నిరూపించుకోవాలని అన్నారు.

సోమవారం నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో సీటింగ్ అరేంజ్‌మెంట్లను పరిశీలించిన సిఎస్ సోమేశ్ కుమార్, మంత్రి ప్రశాంత్ రెడ్డి. చిత్రంలో స్పీకర్ పోచారం, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఉన్నారు.

భారత్ బయోటెక్‌కు కీలక అనుమతులు

కోవాగ్జిన్ రెండో దశ ట్రయల్స్‌కు ముందడుగు

హైదరాబాద్,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): కరోనాకు చెక్ పెట్టేందుకు ప్రపంచవ్యాప్తంగా చాలా సంస్థలు కృషి చేస్తున్నాయి... వ్యాక్సిన్, మందులు, కొత్త పరికరాలు.. కొత్త ఆవిష్కరలు.. ఇలా రకరకాల ప్రయోగాలు కొనసాగుతున్నాయి... ఇక, భారత ఫార్మా రంగంలో హైదరాబాద్ ఫార్మా రంగానికి కూడా ప్రత్యేక స్థానం ఉంది.. కొవాక్సిన్ టీకాను అభివృద్ధి చేస్తున్న హైదరాబాద్ ఫార్మా దిగ్గజం భారత్ బయోటెక్‌కు కీలక అనుమతులు లభించాయి. ఈ వ్యాక్సిన్ రెండో దశ క్లినికల్ ట్రయల్స్‌కు భారత ఔషధ నియంత్రణ సంస్థ అనుమతులు ఇచ్చింది. ఇప్పటికే తొలిదశ క్లినికల్ ట్రయల్స్ విజయవంతంగా నిర్వహించగా.. ఆశాజనక ఫలితాలు రావడంతో సోమవారం నుంచి దేశవ్యాప్తంగా రెండో దశ ట్రయల్స్ ప్రారంభం కానున్నాయి. రెండో దశ పరీక్షలకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసిన ఈ సంస్థ.. దేశవ్యాప్తంగా ఐసీఎంఆర్ ఎంపిక చేసిన 12 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనుంది.

అసెంబ్లీ సమావేశాలకు రంగం సిద్ధం

కరోనా,సచివాలయ కూల్చివేత,వరదలపై చర్చకు కాంగ్రెస్ పట్టు

-అసెంబ్లీ సమావేశాలకు పోలీసుల బందోబస్తు

హైదరాబాద్,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): అసెంబ్లీ సమావేశాలకు రంగం సిద్ధం అయ్యింది. సోమవారం 7వ తేదీనుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో వివిధ అంశాలపై చర్చకు కాంగ్రెస్ సిద్ధం అవుతోంది. ప్రధానంగా కరోనా చికిత్సలు, వరదలు, ప్రభుత్వ అవినీతి, సచివాలయ కూల్చివేత తదితర అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని చూస్తోంది. సమస్య ఏదైనా గట్టిగానే సమాధానం ఇచ్చేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఎలాంటి సమస్య అయినా సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలని సిఎం కెసిఆర్ ఇప్పటికే మంత్రులను సన్నద్ధం చేశారు. వివిధ సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క అన్నారు. హైకోర్టు నిలదీసింది, గవర్నర్ వ్యాఖ్యానించిన విషయాలు ప్రస్తావిస్తామని అన్నారు.

మరోవైపు కరోనా కారణంగా పలువురు ఎమ్మెల్యేలు హాజరయ్యే అవకాశాలు లేవు. ఆర్థికమంత్రి హరీష్ రావుకు కరోనా సోకడంతో ఆయన అసెంబ్లీ సమావేశాలకు దూరం కానున్నారు. కాగజ్ నగర్ ఎమ్మెల్యే కోనప్ప కూడా కరోనా బారిన పడ్డారు. ఇదిలావుంటే కరోనా నెగెటివ్ వస్తేనే అసెంబ్లీ సమావేశాలకు అనుమతిస్తామని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రత్యేక పరిస్థితుల్లో అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు జరగబోతున్నాయని అందువల్ల ఎవరికి వారు కరోనా జాగ్రత్తుల తీసుకుని రావాలని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సమావేశాలకు వచ్చే వారందరూ పూర్తిగా అప్రమత్తంగా ఉండి, కరోనా పరీక్షలు చేయించుకోవాలని స్పీకర్ సూచించారు. ఈ మేరకు అసెంబ్లీలో సీటింగ్ అరేంజ్‌మెంట్ చేయించారు. సమావేశాల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. మాస్కు ఉంటేనే సభలోకి అనుమతి ఉంటుందని కూడా తేల్చి చెప్పారు. జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలు ఉంటే అసెంబ్లీ ప్రాంగణంలోకి అనుమతించరని కూడా తేల్చారు. శరీర ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటేనే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ మేరకు అసెంబ్లీ ఆవరణలో కరోనా టెస్టింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి, టెస్టులు మొదలు పెట్టారు. స్పీకర్ పోచారం సహా అంతా టెస్ట్ చేయించుకున్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు అధికారులు, సిబ్బంది, పోలీసులు, మీడియా ప్రతినిధులు, మంత్రుల పీఎస్‌లు, పీఏలకు తప్పనిసరిగా కొవిడ్ పరీక్షలు చేయిస్తున్నారు కొవిడ్ పాజిటివ్ తేలితే అసెంబ్లీ ప్రాంగణంలోకి రావొద్దని స్పీకర్ విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేల పీఏలను అసెంబ్లీ ప్రాంగణంలోకి అనుమతించ రని స్పీకర్ తెలిపారు. అన్ని ప్రవేశాల వద్ద థర్మల్ స్క్రీనర్లు ఏర్పాటు చేశారు. కరోనా నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. పార్లమెంటు ఇచ్చిన గైడ్ లైన్స్ ప్రకారమే సమావేశాలు జరిపేలా చర్యలు తీసుకుంటున్నామని శాసనసభా వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చెప్పారు. మరోవైపు పోలీసులు కూడా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అసెంబ్లీ పరిసరాల్లో 144 సెక్షన్ విధించారు. ఎమ్మెల్యే లు బయట చేయించుకున్నా సరే.. నెగటివ్ రిపోర్ట్ చూపిస్తేనే అసెంబ్లీలోకి అనుమతిస్తామన్నారు. లాబీల్లోకి, మంత్రుల ఛాంబర్‌లోకి మీడియా ప్రతినిధులకు అనుమతి నిషేధించారు.

సరిహద్దుల్లో వెనక్కి తగ్గాల్సిందే

చైనాకు స్పష్టం చేసిన భారత్

ఉద్రిక్తతలకు బాధ్యత భారత్‌దే అన్న చైనా

చైనా వితండవాదంపై స్ట్రాంగ్ వార్నింగ్

మాస్కో,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): ఉద్రిక్తతలను చర్చల ద్వారా మాత్రమే పరిష్కరించుకోగలమని భారత్ వ్యాఖ్యానించింది. ఈ ప్రాంతంలో శాంతి, సుస్థిరత.. ఉద్రిక్తతలు తగ్గించడం.. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై ఇరు దేశాలు దృష్టి సారించాల్సి ఉందని పేర్కొంది. దీనిపై భారత్ కూడా అదే రీతిన సమాధానమిస్తూ మరో ప్రకటన విడుదల చేసింది. తాము కూడా సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతకు కట్టుబడి ఉంటామని ఘాటుగా బదులిచ్చింది. అదే సమయంలో సరిహద్దుల్లో ఉద్రిక్తతలు తగ్గించేందుకు ఇరు దేశాలు కషి చేయాలని సూచించింది. ద్వైపాక్షికంగా, సైనిక మార్గాల్లో ఈ చర్చలు ఉండాలని పేర్కొంది. భారత్, చైనా మధ్య లడఖ్ సరిహద్దు అంశం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. పలుమార్లు రెరడు దేశాల సైనికులు.. వాస్తవాధీన రేఖ వద్ద ఘర్షణకు కూడా దిగారు. దీంతో ఉద్రిక్తతలను తగ్గించేందుకు.. రెరడు దేశాలు సైనిక, దౌత్యపరమైన చర్చలు కూడా చేపట్టాయి. ఇరు దేశాల రక్షణ మంత్రులు కలుసుకోవడం ఇదే మొదటిసారి. సరిహద్దులో యథాతథ స్థితిని పునరుద్ధరించేందుకు చైనా సహకరించాలని రాజ్‌నాథ్ సదస్సులో గట్టిగా డిమాండ్ చేశారు. సరిహద్దు విషయంలో చైనా వ్యవహార తీరుపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్టుగా తెలుస్తోంది. దౌత్య, సైనిక మార్గాల ద్వారా చర్చలు ముందుకు సాగాలని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి అనురాగ్ శ్రీవాస్తవ అభిప్రాయం వ్యక్తం చేశారు. సరిహద్దుల్లో ఇరు దేశాల మధ్య తీవ్ర స్థాయి ఉద్రిక్తతలు నెలకొన్న తరుణంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చైనా రక్షణ మంత్రి వెయ్ ఫెంఫె మాస్కోలో 2 గంటల 20 నిమిషాల పాటు భేటీ అయ్యారు. మే నెలలో రెరడు దేశాల మధ్య ఘర్షణ వాతావరణం ప్రారంభమైన తర్వాత ఇలాంటి అత్యున్నత స్థాయి భేటీ ప్రత్యక్షంగా జరగడం ఇదే మొదటిసారి. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) రక్షణ మంత్రుల సమావేశంలో పాల్గొనేందుకు రాజ్‌నాథ్, ఫెంఘెలు మాస్కో వచ్చారు. సరిహద్దుల్లో చైనా ప్రదర్శిస్తున్న దురుసు వైఖరిపై ఈ భేటీలో భారత్ తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేసినట్లు అధికారిక వర్గాల సమాచారం. ఘర్షణలకు ముందు ఉన్న స్థితిని వెంటనే పునరుద్ధరించాలని చైనాకు భారత్ తెగేసి చెప్పినట్లు తెలుస్తోంది. అలాగే, బలగాల్ని వీలైనంత త్వరగా ఉపసంహరించుకోవాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం నెలకొన్న ఘర్షణ వాతావరణం చల్లార్చేలా చర్చలు చేపట్టేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చింది. ఈ భేటీకి రాజ్‌నాథ్ వెంట రక్షణశాఖ కార్యదర్శి అజయ్ కుమార్, రష్యాలో భారత రాయబారి డి.బి.వెంటకేశ్ వర్మ హాజరయ్యారు. అంతకుముదు ఎన్‌సీవో సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించిన రాజ్‌నాథ్.. ప్రాంతీయ శాంతి, సుస్థిరతలకు పరిరక్షించుకోవాలంటే దురుసుతనాన్ని వీడాలని చైనాకు పరోక్ష హితబోధ చేశారు. ఒక దేశం మరో దేశంపై ప్రదర్శించిన దురుసుతనం వల్ల అందరూ నష్టపోవడాన్ని రెరడో ప్రపంచ యుద్ధం కళ్లకు కట్టిందని రాజ్‌నాథ్ గుర్తుచేశారు.సరిహద్దుల్లో ఉద్రిక్తతలపై డ్రాగన్ దేశం మరోసారి అసత్యాలను వల్లె వేసింది. మాస్కోలో భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌తో చైనా రక్షణ మంత్రి ఫెంఘె సమావేశం అనంతరం ఆ దేశం ఓ ప్రకటన జారీ చేసింది. సరిహద్దుల్లో ఉద్రిక్తతలకు బాధ్యత మొత్తం భారత్‌దేనని వ్యాఖ్యానించింది. భారత్ చర్యల వల్లే ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయని పేర్కొంది. తమ సార్వభౌమ ప్రదేశం నుంచి ఒక్క అంగుళం కూడా వదులుకునేందుకు సిద్ధంగా లేమని పేర్కొంది. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) రక్షణ మంత్రుల సమావేశానికి హాజరైన రాజ్‌నాథ్, ఫెంఘె విడిగా భేటీ అయిన సంగతి తెలిసిందే. ఈ భేటీలో ఘర్షణలకు ముందు ఉన్న స్థితిని వెంటనే పునరుద్ధరించాలని చైనాకు భారత్ తెగేసి చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో డ్రాగన్ దేశం తన చర్యలను సమర్థించుకుంటూ ఈ ప్రకటన విడుదల చేసింది. తమ సరిహద్దులు కాపాడుకునేందుకు చైనా సైన్యం ఎప్పుడూ సంసిద్ధంగా ఉంటుందని తెలిపింది. ప్రధాని నరేంద్రమోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య కుదిరిన ఏకాభిప్రాయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఆ ఒప్పందాన్ని అమల్లో చూపాలని భారత్‌కు ఉచిత సలహా ఇచ్చింది.

స్టేట్ ఆఫ్ యంగ్ చైల్డ్ ఇన్ ఇండియా

-పుస్తకాన్ని ఆవిష్కరించిన వెంకయ్య

న్యూఢిల్లీ,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): ఆరోగ్యభారత నిర్మాణంలో భాగంగా చిన్నారులకు సరైన పౌష్టికాహారాన్ని అందించడం అత్యంత కీలకమైన అంశమని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. చిన్నారుల సంక్షేమం ద్వారానే దేశాభివద్ధికి పునాది పడుతుందని ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు పౌరసమాజం స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఉపరాష్ట్రపతి నివాసంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ సమావేశ ప్రాంగణంలో..'స్టేట్ ఆఫ్ యంగ్ చైల్డ్ ఇన్ ఇండియా' పుస్తకాన్ని ఆన్‌లైన్ వేదిక ద్వారా వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. పుస్తకంలో ప్రస్తావించిన పలు అంశాలను కూడా ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి ఉటంకించారు. 'భారతదేశంలో 15.9 కోట్ల మంది ఆరేళ్లలోపు చిన్నారులు ఉన్నారు. ఇందులో 21 శాతం మందిలో పోషకాహారలోపం, 36శాతం మంది తక్కువ బరువుతో ఉండగా.. 38 శాతం మందికి టీకాలు అందడం లేదని కొన్ని నివేదికలు చెబుతున్నాయి. ఈ అంకెలు.. చిన్నారులతో పాటు దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మనం మరింత కృషి చేయాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

టీచర్లకు శుభాకాంక్షలు తెలిపిన సబిత

-సంతాపదినాలు ముగిసిన తరవాత అవార్డులు పంపిణీ

హైదరాబాద్,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): విద్యార్థుల భవిష్యత్తు కోసం పాటుపడుతున్న

విద్యారంగ పటిష్టతే సర్వేపల్లికి నివాళి

నేటినిజం
ఆదివారం 6-9-2020

ఉపాధ్యాయ దినోత్సవం వస్తుందంటే ఏటా అన్ని పాఠశాలల్లో పండుగ వాతావరణం కనిపించేది. కానీ ఈ యేడు రెండు విషయాలతో అసలు ఉపాధ్యాయ దినోత్సవాలకు అవకాశం లేకుండా పోయింది. అయితే ఈ స్ఫూర్తిని తీసుకుని ముందుకు సాగాల్సిన అవసరం మాత్రం ఉంది. సమాజంలో గురువులను ఎంతగా గౌరవించుకుంటే మనం అంతగా బలమైన సమాజాం నిర్మించుకోగలం. సర్వేపల్లి రాధాకృష్ణణ్‌ను స్ఫూర్తిగా తీసుకుని మన సమాజాం బలపడేలా మంచి విద్యా వ్యవస్థకు శ్రీకారం చుట్టేందుకు ప్రభుత్వాలు కంకణం కట్టాలి. మాతృ దేవోభవ.. పితృ దేవోభవ.. ఆచార్య దేవోభవ.. అంటూ తల్లిదండ్రుల తర్వాత మహోన్నత స్థానాన్ని గురువుకు ఇచ్చిన గొప్ప సంస్కృతి భారతీయులది. ప్రపంచ దేశాలతో పోలిస్తే భారతదేశంలో గురువులకు ఉన్న గౌరవస్థానం ఎంతో ఉన్నతమైనది. విద్యాబుద్ధులు నేర్పి, సమాజంలో మనం సన్మార్గంలో నడవడంలో వారి పాత్ర కీలకం. భవిష్యత్‌లో ఏ స్థాయిలో ఉన్నా ఉపాధ్యాయులను గుర్తు చేసుకోవాలన్న ప్రేరణతో ఏటా ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నాం. భారత మాజీ రాష్ట్రపతి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఏటా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటు కున్నాం. ఆయన ఉపాధ్యాయ వృత్తి నుంచి దేశ అత్యున్నత పదవిని అధిరోహించిన మహనీయుడు.అయితే కరోనా మహమ్మారి కారణంగా ఈ యేడు పాఠశాలలను తెరచుకోలేక పోయాం. అలాగే విద్యాసంవత్సం ప్రారంభించుకోలేక పోయాం. దీనికితోడు ఇటీవలే మాజీరాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ మరణంతో సంతాప దినాలు పాటిస్తున్నాం. ఈక్రమంలో ఏటా నిర్వహించే టీచర్స్‌దేకు అవకాశాలు లేకుండా పోయాయి. అయినా వారిని వ్యక్తిగతంగా తలచుకుని పూజించే అవకాశాలను మాత్రం వదులుకోవద్దు. మనం నిరంతరం గురు స్మరణలో ఉంటూ ఉన్నత పౌరులుగా ఎదగడానికి రాధాకృష్ణణ్ లాంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలి. ప్రభుత్వాలు కూడా ఉత్తమ సమాజం, ఉత్తమ పౌరులను తీర్చిదిద్దుకునేందుకు మొక్కుబడి టీచర్స్ దే నిర్వహించడం కాకుండా టీచర్ల సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేయాలి. కరోనాతో లక్షలాది మంది ప్రైవేట్ టీచర్లు రోడ్డున పడ్డారు. వారికి ఉపాధి కల్పించే ప్రయత్నాలు చేయాలి. ఆయా విద్యా సంస్థలతో మాట్లాడి వారికి జీతాలు అందేలా చేయాలి. ఇకపోతే పాఠశాలలు మొదలు యూనివర్సిటీల వరకు ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణం భర్తీ చేయాలి. అప్పుడే టీచర్లను గౌరవించుకున్న వారం అవుతాం. పాఠశాలల్లో విద్యార్థుల తప్పులు సరిచేస్తూ వారిని సన్మార్గంలో నడిచేలా ప్రోత్సహించడంలో ఉపాధ్యాయుల కృషి అంతా ఇంతా కాదు. క్లాసులో అల్లరి చేస్తున్నా ఎంతో ఓపికగా పిల్లల్ని కూర్చోబెట్టి చదువు చెబుతారు. తప్పు చేస్తే తప్పు అని చెప్పి, భవిష్యత్తులో మళ్లీ చేయవద్దని చెప్పే దయాగుణం గురువులది మాత్రమే. అంతటి గొప్ప మనసున్న టీచర్లను ఏటా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సన్మానించి, ఆశీర్వాదం తీసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అలా చేసుకోవడం వల్లనే ఇవాళ ఎందరో మహానుభావులు మనకు ఉద్భవిస్తున్నారు. వీరంతా టీచర్లు సానపెట్టడం వల్ల సమాజంలోకి అడుగుపెట్టిన వారే అని గుర్తించాలి. విద్యార్థులు తమ గురువులను సన్మానించాలని, వారి ఆశీర్వాదం పొందాలని సెప్టెంబర్ 5న ఆనందంతో వేడుకల్లో పాల్గొంటారు. కానీ ఈ ఏడాది కరోనా వైరస్ కారణంగా ఆ సందడి కనుమరుగైంది. పాఠశాలల్లో విద్యాబోధన జరగడం లేదు. విద్యార్థులు ఇళ్లకే పరి మితమయ్యారు. ఈ పరిస్థితుల్లో ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకునే అవకాశం లేకుండా పోయిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థులకు ఆన్‌లైన్‌లో విద్యాబోధన చేస్తున్నారు. తరగతి గదిలో దేశ భవిష్యత్ ఉంటుందని చాటిన ఆచార్యుడు 'సర్వేపల్లి రాధాకృష్ణన్'. వివిధ విశ్వవిద్యాలయాల్లో

ఆచార్యుడిగా, తర్వాత రోజుల్లో దేశప్రథమ పౌరుడిగా దేశవిదేశాల్లో ఎంతో కీర్తి గడించారు. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండాలన్న సర్వేపల్లి ఆశయాలను నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి. సామాన్య కుటుంబంలో పుట్టి.. దేశ అత్యున్నత పీఠాన్ని అధిరోహించిన ఆచార్యుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. కరోనా సంక్షోభ సమయం కారణంగా ఈసారి ఉపాధ్యాయ దినోత్సవం పాఠశాలల్లో కళాశాలల్లో జరుపుకునే పరిస్థితి లేదు.

ఉపాధ్యాయ అవార్డు ఉత్సవాలను కూడా రద్దు చేశారు. కానీ గొప్ప ఉపాధ్యాయుడిగా, అధ్యాపకుడిగా, ఆచార్యుడిగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ స్ఫూర్తి కొనసాగుతుంది. కరోనా నేపథ్యంలో ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు విద్యా సంస్థలు తెరుచుకోలేదు. ఎప్పుడు తెరుస్తారో కూడా తెలియని పరిస్థితి లో ఉన్నాం. టెక్నాలజీ, ఆన్‌లైన్ క్లాసులు ఉపాధ్యాయుడికి, తరగతి గదికి ప్రత్యామ్నాయం కాదని మరోసారి వెల్లడైంది. వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దటం, విద్యార్థిలో సామాజికీకరణ పెంపొందించటం, విద్యార్థుల భవిష్యత్‌ని తీర్చిదిద్దటం, ప్రశ్నించేతత్వాన్ని పెంచటం మొదలైనవి తరగతి గదిలోనే సాధ్యం అన్నది కూడా తేలిపో యింది. వీటిని తరగతి గదిలో ఉపాధ్యాయుడు మాత్రమే చేయగలడు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దే ఉపాధ్యాయుల పట్ల అధ్యాపకుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు సక్రమంగా లేవు.

ఉపాధ్యాయుల సంక్షేమంపట్ల శ్రద్ధ చూపటం లేదు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. ఎయిడెడ్, పార్ట్-టైం అధ్యాపకులకు న్యాయం చేయవలసి ఉన్నది. వారి సర్వీసులను క్రమబద్ధీకరించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగాలలో ప్రైవేటీకరణ విధానాలు అవలంబించటమేకాక, ప్రోత్సహి స్తున్నాయి. దశాబ్దాలుగా విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ పెద్ద ఎత్తున జరిగింది. ప్రైవేట్ యూనివర్శి టీలు, డీమ్డ్ యూనివర్శిటీలు కూడా వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన విద్యా విధానం కూడా ప్రైవేటీకరణను ప్రోత్సహించే విధంగా ఉన్నదన్న ఆందోళనా ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవటానికి పౌరసమాజం ఉద్యమించాల్సిన అవసరమున్నది. దానిలో భాగంగానే ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, ఉపాధ్యాయుల సంక్షేమానికి ఉద్యమాలు చేయటం,ఉపాధ్యాయులను సంఘటిత పరచటం జరగాలి. ముఖ్యంగా ప్రైవేట్ ఉపాధ్యాయులు సంఘటితమై హక్కులు సాధించుకోవాలి. విద్యా వ్యవస్థకు మూలస్తంభమైన ఉపాధ్యాయుల సంక్షేమాన్ని పట్టించుకోవలసిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉంది. అందుకు ఎలాంటి చర్యలకైనా వెనకాడరాదు.

సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీలో
దీక్షాంత్ పెరేడ్‌లో పాల్గొన్న 131 మంది ప్రొబేషనర్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 5 హైదరాబాద్ లోని సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీ లో శిక్షణ పూర్తి చేసుకున్న ఐపిఎస్ అధికారుల దీక్షాంత్ పెరేడ్ ఈ రోజు జరిగింది. ఈ పాసింగ్ అవుట్ పెరేడ్‌కు ప్రస్తుత బ్యాచ్ ఉత్తమ ప్రొబేషనర్ డి.వి. కిరణ్ శృతి నాయకత్వం వహించారు.

ఈ కార్యక్రమంలో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్సు ద్వారా ముఖ్యఅతిథిగా పాల్గొని, పాసింగ్ అవుట్ పెరేడ్‌లో పాల్గొంటున్న ప్రొబేషనర్లతో ముచ్చటించారు. శారీరక దారుఢ్య ప్రాధాన్యతను ప్రస్తావిస్తూ ప్రధాన మంత్రి, శిక్షణ పూర్తి చేసుకున్న వారు శారీరక దారుఢ్యాన్ని కాపాడుకోవాలని, ఇది వారి విధిలో భాగమని అన్నారు. మంచి మనిషిగా ఉండలేని వారు మంచి అధికారి కాలేరని ప్రధాన మంత్రి అన్నారు. సమాజానికి ఉపయోగపడే అంశాలను ఎంచుకుని వాటిని సాధించేందుకు ప్రయత్నించాలని ఆయన వారికి పిలుపునిచ్చారు. సమాజంలోని నిగూఢంగా ఉన్న శక్తి సామర్థ్యాలు ఉపయోగించుకుని, ప్రజలకు ఉపయోగపడే లక్ష్యాల సాధనకు కృషి చేయాలని ఆయన సూచించారు.

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడుతూ, అకాడమీ నుంచి శిక్షణ పూర్తి చేసుకుని పాసింగ్ అవుట్ పెరేడ్ లో పాల్గొన్న వారికి తన అభినందనలు తెలిపారు. ప్రధాన మంత్రి దార్శనికత అయిన స్మార్ట్ పోలిసింగ్‌ను సాకారం చేసేందుకు చిత్తశుద్ధితో, సమగ్రతతో పనిచేయాల్సిందిగా ఆయన వారికి సూచించారు.

సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ డైరక్టర్ శ్రీ అతుల్ కర్వాల్ మాట్లాడుతూ, అకాడమీ నుంచి శిక్షణ పూర్తి చేసుకున్న ప్రొబేషనర్ల పై దేశ ప్రజలకు ఎన్నో ఆశలు ఉన్నాయని, వారు ఎలాంటి క్లిష్ట పరిస్థితినైనా సందర్భానుసారం ఎదుర్కొని విజయం సాధించగలరన్న విశ్వాసం తనకు ఉందని ఆయన అన్నారు. విజేతలకు ఆయన ట్రోఫీలు ప్రదానం చేశారు.

శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో 2018 బ్యాచ్ 71 ఆర్.ఆర్ కు చెందిన 121 మంది అధికారులు, 2017 బ్యాచ్ 70 ఆర్.ఆర్ కు చెందిన 10 మంది అధికారులు కలిపి మొత్తం 131 మంది ఉన్నారు.

కోవిడ్ నిబంధనలు అనుసరించే మసీదుల్లో ప్రార్థనలు
-ఎమ్మెల్యేలతో సమీక్షించిన హోంమంత్రి మహ్మూద్ అలీ

హైదరాబాద్,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన కోవిడ్ నిబంధనలను అనుసరించే రాష్ట్రంలో మసీదుల్లో ప్రార్థనలు నిర్వహించాలని హోంశాఖ మంత్రి మహమూద్‌అలీ తెలిపారు. చారిత్రక మక్కామసీదు, షాహీమసీదుల్లో ప్రార్థనల పునరుద్ధరణ పక్రియను చర్చించేందుకు తన కార్యాలయాలో ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యేలు ముంతాజ్‌అహ్మద్‌ఖాన్, అహ్మద్‌పాషా ఖాద్రి, మైనారిటీ సంక్షేమ సలహాదారు ఎకెఖాన్, ప్రిన్సిపల్ సెక్రటరీ నదీమ్ అహ్మద్, మైనారిటీ వెల్ఫేర్ డైరెక్టర్ షానవాజ్‌ఖాన్, జిల్లా మైనారిటీ సంక్షేమఅధికారి మహ్మద్‌ఖాసిమ్, తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెండు మసీదుల్లో 50 మందికి అనుమతించారు. ఇది సెప్టెంబరు 5వ తేదీ నుంచి అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించారు. ప్రార్థనల సమయంలో మాస్కులు ధరించాలని, సామాజిక దూరం పాటించాలని హోంమంత్రి ప్రజలకు విజ్ఞప్తిచేశారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల ప్రకారం 10 సంవత్సరాలలోపు, 65 సంవత్సరాలపై బడిన వారు తమ సొంత ఇళ్లలోనే ప్రార్థనలు చేయాలని అన్నారు. కరోనా వైరస్ వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చే వరకూ తగిన జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యమని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ప్రజలు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు కట్టుబడి ఉండాలని అన్నారు.

టీచర్లకు శుభాకాంక్షలు చెప్పిన జగన్

అమరావతి,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): విద్యార్థులందరికీ సమాన అవకాశాలు కల్పిస్తూ విద్యా హక్కును అందించాలన్న తమ లక్ష్య సాధనలో ఉపాధ్యాయులే మార్గదర్శకులుగా తమ ప్రభుత్వం విశ్వసిస్తోందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మాజీ రాష్ట్రపతి, ప్రముఖ విద్యావేత్త సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా టీచర్లకు ఆయన ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. భావి పౌరులకు విద్య, విజ్ఞానాన్ని అందించి సరైన దిశానిర్దేశర చేయడం ద్వారా జాతి నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషిస్తున్నారని సీఎం గుర్తు చేశారు. నైతిక విలువలే పునాదులుగా విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేని అన్నారు. 'గురువును దైవంగా పూజించే సంప్రదాయం భారతదేశానిది. విద్య, వివేకం, విలువలు నేర్పి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే గురువులకు వందనం' అని సీఎం వైఎస్ జగన్ ట్విటర్‌లో పేర్కొన్నారు.

వివిధ రాష్ట్రాల్లో చేపట్టనున్న ఉపఎన్నికల నిర్వహణ ప్రక్రియ.

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: వివిధ రాష్ట్రాల్లో ఉప ఎన్నికల నిర్వహణ గురించి ఈ రోజు కమిషన్ సమావేశం జరిగింది. ప్రస్తుతం, శాసనసభ / పార్లమెంటరీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలకు 65 స్పష్టమైన ఖాళీలు ఉన్నాయి, వీటిలో వివిధ రాష్ట్రాల రాష్ట్ర శాసనసభలలో 64 ఖాళీలు, పార్లమెంటరీ నియోజకవర్గానికి 1 (ఒకటి) ఖాళీలు ఉన్నాయి.

కొన్ని చోట్ల అదనపు సాధారణ భారీ వర్షాలు మరియు మహమ్మారి వంటి ఇతర అవరోధాలతో సహా అనేక అంశాల దృష్ట్యా తమ రాష్ట్రాల్లో ఉప ఎన్నికలను వాయిదా వేయాలని కోరుతూ అనేక సంబంధిత రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు / ముఖ్య ఎన్నికల అధికారులు పంపిన నివేదికలు మరియు సమాచారాన్ని కమిషన్ సమీక్షించింది.

బీహార్ సాధారణ అసెంబ్లీ ఎన్నికలు కూడా జరగాల్సి ఉంది. 2020 నవంబర్ 29వ తేదీ లోపు ఈ ఎన్నికలు పూర్తి కావల్సిఉంది. మొత్తం 65 స్థానాలకు ఉప ఎన్నికలతో పాటు, బీహార్ సాధారణ అసెంబ్లీ ఎన్నికలను కూడా, ఒకే సమయంలో నిర్వహించాలని కమిషన్ నిర్ణయించింది. సి.ఏ.పి.ఎఫ్. / ఇతర శాంతిభద్రతల కదలికలతో పాటు సంబంధిత వస్తు రవాణా సమస్యలను పరిష్కరించడానికి వీలుగా ఉంటుందనేది, ఈ ఎన్నికలను ఒకే సారి నిర్వహించడానికి గల ప్రధానకారణాలలో ఒకటి.

దేశంలో సెకండ్‌వేవ్‌లో కరోనా

జాగ్రత్తలు తీసుకోక పోవడమే కారణం
ప్రజల అజాగ్రతతో విస్తరిస్తున్న మహమ్మారి
ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రణ్‌దీప్ గులేరియా ఆందోళన

న్యూఢిల్లీ,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): దేశ వ్యాప్తంగా కరోనా విజృంభణ పెరిగిందని, కొన్నిచోట్ల సెకండ్ వేవ్ కూడా మొదలై పోయిందని ఢిల్లీ ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రణ్‌దీప్ గులేరియా అన్నారు. కరోనా వ్యాపించిన తొలినాళ్లలో తీసుకున్నంతగా ప్రజలు ఇప్పుడు జాగ్రత్తలు తీసుకోవడం లేదని, ఢిల్లీలో కొంతమంది మాస్కులు లేకుండానే బయట సంచరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గుంపులుగా ఒక్కచోట చేరుతున్నారని, కరోనా వ్యాప్తికి ముందున్న విధంగానే భారీ ఎత్తున ట్రాఫిక్ జామ్ అవుతోందని.. ఇవన్నీ సెకండ్ వేవ్‌కు దారితీసే విధంగా ఉన్నాయన్నారు. చిన్న చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా మహమ్మారి అంతకంతకూ విస్తరిస్తోందన్నారు. ఇలాంటి తరుణంలో ఇప్పుడప్పుడే వైరస్ కనుమరుగయ్యే అవకాశం కనిపించడం లేదని, భారీ సంఖ్యలో పాజిటివ్ కేసులు వెలుగు చూస్తున్నాయన్నారు. అయితే దేశంలో కరోనా నిర్ధారణ పరీక్షల సామర్థ్యం పెరిగిందని, కాబట్టే కేసుల సంఖ్య పెరుగుతుందని పేర్కొన్నారు. ఒకానొక సమయంలో శిఖర స్థాయిని చేరిన తర్వాత కరోనా బాధితుల సంఖ్య తగ్గే అవకాశం ఉందని తెలిపారు. ఇతర దేశాలతో పోలిస్తే మన జానాభా చాలా ఎక్కువ అని, అది కూడా కేసుల సంఖ్యపై ప్రభావం చూపుతుందన్నారు. రోజుకు పది లక్షల కంటే ఎక్కువ కరోనా టెస్టులు చేస్తున్నామని పేర్కొన్నారు. కోవిడ్-19 వ్యాప్తి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నియమించిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌లో కీలక సభ్యుడిగా ఉన్న డాక్టర్ గులేరియా.. ఇండియా టుడేకి శుక్రవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు చాలా దేశాల్లో కరోనా నిరోధక వ్యాక్సిన్ ప్రయోగాలు మొదలయ్యాయి. భారత్ నుంచే 3 వ్యాక్సిన్లు రాబోతున్నాయి. అయితే ఏ వ్యాక్సిన్ అయినా ఎంత వరకు సురక్షితం, సమర్థవంతమైనది అన్న దానిపైనే కరోనా కట్టడి ఆధారపడి ఉంటుంది. రష్యా వ్యాక్సిన్ స్పుత్నిక్ వీ గురించి ది లాన్సెట్‌లో ప్రచురించిన కథనం చూసినట్లయితే.. శాంపిల్ సైజ్ చాలా తక్కువగా ఉంది. చాలా తక్కువ మందిపై ప్రయోగాలు జరిపారు. చిన్నపాటి సైడ్ ఎఫెక్ట్ ఉంటాయని చెప్పారు. కాబట్టి మూడో దశ ట్రయల్స్ పూర్తి చేసుకుంటేనే గానీ కోవిడ్‌ను అంతం చేయగల టీకా అందుబాటులోకి వచ్చే విషయం గురించి ఓ అవగాహనకు రాలేము. ఇందుకు ఇంకా కొన్ని నెలల సమయం పట్టవచ్చు. అంతా సాఫీగా జరిగి, ఈ ఏడాది చివర్లోగా వ్యాక్సిన్ వస్తే బాగుంటుంది. ఇక యూనివర్సల్ వ్యాక్సినేషన్‌కు మరికొంత ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉందని గులేరియా పేర్కొన్నారు. వ్యాక్సిన్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చేంత వరకు.. అన్ని చోట్లా భౌతికదూరం పాటిస్తూ, మాస్కులు ధరిస్తూ, తరచుగా చేతులు శుభ్రం చేసుకుంటూ, వ్యక్తిగత శుభ్రత పాటించాలని గులేరియా ప్రజలకు సూచించారు. లాక్‌డౌన్ సడలింపుల నేపథ్యంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

భారతీయుల మద్దతు నాకే అన్న ట్రంప్

మోడీ భరాత్‌కు దొరికిన గొప్ప నాయకుడని ప్రశంసలు
చైనా విషయంలో సాయం చేయడానికి సిద్ధమే అని ప్రకటన

వాషింగ్టర్,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): ప్రధాని నరేంద్ర మోడీపై అమెరికాలో నివసిస్తున్న భారతీయులపై ట్రంప్ ప్రశంసల వర్షం కురిపించారు. రాబోయే ఎన్నికల్లో ఇండియన్ అమెరికన్స్ కచ్చితంగా తనకే ఓటు వేస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. భారత్ నుంచి మాకు విశేషమైన మద్దతు ఉంది. తాము ప్రధాని మోడీకి గట్టి మద్దతుదారులుగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. హోస్టన్‌లో హౌడీ మోడీ కార్యక్రమంగా అద్భుతంగా జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి నేను ప్రధాని మోడీని ఆహ్వానించానని తెలిపారు. భారత దేశం నుంచి మాకు గొప్ప మద్దతు ఉందన్నారు. మోడీ నుంచి కూడా గొప్ప మద్దతు ఉందని... భారతీయులకు మంచి నాయకుడు దొరికాడని ట్రంప్ వ్యాఖ్యానించారు. కరోనా తీవ్రరూపం దాల్చక ముందే భారత్‌లో పర్యటించానని, కరోనా కారణంగా భారత్ చాలా దెబ్బతిందని ఆయన తెలిపారు. భారత ప్రజలు చాలా గొప్ప వారని, దేశం కూడా చాలా గొప్ప దేశమని ట్రంప్ ప్రశంసించారు. ఇకపోతే భారత్, చైనా మధ్య సరిహద్దు ఘర్షణలు చోటుచేసుకుంటున్న విషయం తెలిసిందే. ఈ సంఘటనలపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పందించారు. వైట్‌హౌజ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. భారత్, చైనా మధ్య సరిహద్దు సమస్య దారుణంగా మారిందన్నారు. ఈ సమస్య పరిష్కారంలో సహాయం చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు ట్రంప్ తెలిపారు. ఈస్టన్ లడాఖ్‌లో భారత్, చైనా దళాలు వాస్తవాధీన రేఖ వెంట మోహరించ డంతో.. అక్కడ పరిస్థితి భయానకంగా మారింది. భారత్, చైనా బోర్డర్ సమస్య విపత్కరంగా ఉందని, చైనా దూకుడుగా వ్యవహరిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. రెండు దేశాలతోనూ ఈ అంశం గురించి చర్చించానని, హెల్ప్ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు ట్రంప్ చెప్పారు. ఒకవేళ మేం ఏదైనా చేయాలనుకుంటే, ఆ సమస్యను పరిష్కరించగలమని, వారికి హెల్ప్ చేయగలమని ట్రంప్ అన్నారు. ఈ విషయంపై రెండు దేశాలతోనూ సంప్రదింపులు జరుపుతున్నట్లు ట్రంప్ చెప్పారు. మరోవైపు రష్యా పర్యటనలో ఉన్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్.. చైనా రక్షణ మంత్రి ఫెంగీతో భేటీ అయ్యారు. సరిహద్దుల్లో సైన్యాన్ని వెనక్కి తీసుకోవాల్సిందే అని ఖరాఖండిగా చెప్పేశారు.

విద్యార్థులకు స్ఫూర్తి మాలావత్ పూర్ణ

గురుకుల టీచర్ల ఒడిలో రాటుదేలిన రత్నం

నిజామాబాద్,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): తెలంగాణ బిడ్డ పూర్ణ మాలావత్ అంటే తెలియని వారు లేరేమో.. విద్యార్థి లోకానికే ఆమె గర్వకారణం. ఎందరో విద్యార్థులు మాదిరే సామాన్యురాలే అయినా ఓ గురువు కారణంగా మాఎ ఎవరెస్ట్ ఎక్కగలిగారు. దేశానికి, రాష్ట్రానికి పేరు తీసుకుని రాగలిగారు. టీచర్లు సానపెడితే సామాన్యులు అసామాన్యులు అవుతారనడానికి ఆమె సాహసమ జీవితాన్ని ఉదాహరణగా చూడాలి.

ఎవరెస్ట్ ఎక్కిన అతి పిన్న వయస్కురాలు కావడం ఆమె సాహసానికి నిదర్శనం. నిరుపేద కుటుంబం నుంచి వచ్చి, గురుకులాల్లో చదివి, 2014లో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన తెలంగాణ బిడ్డ పూర్ణ మాలావత్. మే 25,2014లో 29,029 ఫీట్ల ఎత్తున్న ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించి రికార్డు సృష్టించిన మలావత్ పూర్ణపై ఇప్పుడు ప్రతి ఒక్కరు పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు. పదమూడేండ్ల ప్రాయంలోనే ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి చరిత్రను సృష్టించిన తెలంగాణ సాహస బాలికను ఎవరు ప్రశంసించకుండా ఉండలేకపోతున్నారు. ఆమె జీవిత చరిత్రపై పూర్ణ అనే టైటిల్ తో సినిమా రూపొందడం తెలంగాణకు గర్వకారణం. ఇలా ఓ విద్యార్థి జీవితం తెరకెక్కడం విద్యార్థులకు స్ఫూర్తిమంత్రంగా నిలవనుంది. రాహుల్‌బోస్ స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నిర్మించారు. తెలుగు, హిందీ భాషల్లో స్ఫూర్తివంతమైన కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రం ఎందరో విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచింది. నిజామాబాద్ జిల్లాలోని పాకాల అనే మారుమూల గ్రామంలో గిరిజన కుటుంబంలో పుట్టి ప్రపంచంలోనే ఎత్తయిన హిమాలయ శిఖరాన్ని అధిరోహించిన అత్యంత పిన్న వయస్కురాలిగా నిలిచిన పూర్ణ పాత్రలో అదితి నటించింది. నగరంలోని శ్రీ అరబిందో ఇంటర్నేషనల్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న అదితి ఆడిషన్స్‌లో పాల్గొని ఈ అవకాశాన్ని కొట్టేసింది. ఇందులో అదితి నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఇక పూర్ణ సంకల్పానికి అండగా నిలిచి ఆమెలో ప్రోత్సాహాన్ని నింపే ఐపీఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్ ఎందరో విద్యార్థులను తీర్చి దిద్దారు. ఇక సినిమాలో పూర్ణ నిజజీవితాన్ని కళ్ళకు కట్టినట్టు చూపించాడు దర్శకుడు రాహుల్. అంతేకాదు పూర్ణకి ప్రోత్సాహం అందించిన ఐఏఎస్ అధికారి ఎస్. ప్రవీణ్ కుమార్ ఎందరో విద్యార్థులను తీర్చి దిద్దారు. ఆయన శిశ్యరికంలో ఎందరో పర్వతారోహకులుగా ఎదిగారు. గురుకులాల టీచర్ల ఒడిలో ఎందరో విద్యార్థులు రాటుదేలి వివిధ రంగాల్లో రాణిస్తున్నారనడానికి మాలావత్ పూర్ణ జీవితం ఓ చక్కని నిదర్శనం.

చోరీలకు పాల్పడుతున్న యువకుడి అరెస్ట్

హైదరాబాద్,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): నగరంలో చోరీలకు పాల్పడుతున్న ఓ యువకుడిని బంజారాహిల్స్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇదే క్రమంలో... నిందితుడి నుంచి 12.5 తులాల బంగారం, 40 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని ఒడిశాకు చెందిన ఉమాశంకర్(24)గా గుర్తించారు. ఉపాధి నిమిత్తం హైదరాబాద్ చేరుకున్న ఉమాశంకర్... కొన్నాళ్లు దినసరి కూలీగా పని చేశాడు. కొన్ని సీరియల్స్‌లో ఆర్టిస్టుగా కూడా పని చేస్తూ జీవనం సాగించాడు. ఇటీవలి కాలంలో ఉపాధి దొరక్కపోవడంతో దొంగతనాల బాట పట్టాడు. తాళం వేసిన ఇళ్లను టా÷-గ్గ÷ట్ చేసుకుని... బంగారం, వెండితో పాటు విలువైన వస్తువులను దొంగిలించినట్లు పోలీసులు వెల్లడించారు.

టిఎన్జీవో అధ్యక్షుడికి కెటిఆర్ అభినందన

హైదరాబాద్,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): టీఎన్జీవో నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మామిళ్ల రాజేందర్ గురువారం రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ను ప్రగతి భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజేందర్‌ను కేటీఆర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్ గౌడ్, టీఎన్జీవో మాజీ అధ్యక్షులు కారం రవీందర్ రెడ్డి, తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం అధ్యక్షురాలు మమత పాల్గొన్నారు. మామిళ్ల రాజేందర్ ప్రస్తుతం ఆఫీస్ సూపరింటెండెంట్‌గా రంగారెడ్డి జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో పనిచేస్తున్నారు.

ప్రెషర్‌కుక్కర్‌లో బంగారం
-కేరళలో పట్టుకున్న అధికారులు

తివనంతపురం,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): కేరళలో విమానాశ్రయంలో అక్రమంగా బంగారం తరలిస్తున్నవ్యక్తిని అరెస్టు చేశారు. కాలికట్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ ఘటన జరిగింది. జెడ్డా నుంచి వస్తున్న ఓ ప్రయ

తెరవెనక మంత్రాంగంలో తెలంగాణ మేధావులు

కెసిఆర్, టిఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పోరాటానికి సన్నద్ధం
కోదండరామ్ పార్టీ పోటీ ఇవ్వడం లేదన్న భావన
కాంగ్రెస్, బిజెపిలకు ఇమేజ్ లేదన్న చర్చ
రేవంత్ ఆధ్వర్యంలో కొత్త పార్టీకి పునాది పడే ఛాన్స్?

హైదరాబాద్,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో మరో ప్రాంతీయ పార్టీ పురుడు పోసుకునేందుకు రంగం సిద్ధం అయ్యింది. ఇప్పుడున్న బిజెపి, కాంగ్రెస్‌లో అధికార టిఆర్ఎస్‌ను, దాని దినేత కెసిఆర్‌ను ఢీకొన లేవని గుర్తించిన కొందరు ప్రాంతీయ పార్టీని నడపాలని నిర్ణయించినట్లు తెలిసింది. అలాగే ప్రొఫెసర్ కోదండరామ్ స్థాపించిన టిజెఎన్ కూడా పోటీని ఇవ్వలేదని గుర్తించారు. దీనికితోడు ఇటీవల టి జర్నలిస్టుల ఫోరం నిర్వహించిన సదస్సులో ఇవే విషయాలు పరోక్షంగా ప్రస్తావనకు వచ్చాయి. ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా పోరాడాలని, లేకుంటే భవిష్యత్ తరం గుర్తించదని కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్,ఎంపి రేవంత్ రెడ్డి అన్న మాటలు ప్రాంతీయ పార్టీకి ప్రేరపించినట్లుగా కనిపిపిస్తోంది. మరోవైపు కాంగ్రెస్‌లో రేవంత్‌ను ముందుకు కదలకుండా వృద్ధనేతలు కాళ్లు పట్టుకుని లాగుతున్నట్లు అర్థం అవుతోంది. విహెచ్ లాంటి వారు బహిరంగంగానే రేంవత్‌ను బచ్చా అన్నరీతిలో చూస్తున్నారు. ఇకపోతే కోదండరామ్ రాజకీయాలు నడపడానికి పనికిరాడని కూడా రేవంత్ చేసిన వ్యాఖ్యలు ఇక్కడ గమనార్హం. ఈ దశలో రేవంత్ రెడ్డి ముందుండి మరో పార్టీకి పురుడు పోసే యత్నాల్లో చురుకుగా పనిచేస్తున్నట్లుగా ఉంది. తూటాలాంటి మాటలతో దూకుడు స్వభావం ఉన్న రేవంత్ మాత్రమే కెసిఆర్‌ను, ప్రభుత్వ తీరును ఎప్పటికప్పుడు దుయ్యబడతున్నారు. కార్యక్షేత్రంలోకి దూకితే వెనుదిరగని నైజం అతనికి ప్రత్యేక గుర్తింపునిచ్చాయి. ఇటీవల శ్రీశైలం ప్రమాదంపై అనేక అనుమానాలు వ్యక్తం చేసి సిబిఐ విచారణ జరిపించాలని కేంద్రాన్ని కోరారు. ఇకపోతే కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా పోరాడుతున్నా ప్రజల్లో దానికి గుర్తింపు రావడం లేదు.

బిజెపి కేంద్రంలో అదికారంలో ఉన్నా ఇక్కడ కెసిఆర్ అక్రమాలపై నోరు మెదపడం లేదు. కేవలం మాటలకే నేతలు పరిమితం అవుతున్నారు. ఈ దశలో తెలంగాణ మేధావులు కొందరు మరో ప్రాంతీయపార్టీ అవసరం ఉందని భావిస్తున్నట్లు సమాచారం. దూకుడు మనస్తత్వం కలిగిన రేవంత్ రెడ్డి తెగించే తత్వమే అనతి కాలంలో దమ్మున్న లీడర్‌గా పేరు తెచ్చుకున్నారు. రేవంత్‌ను ముందుకు పెట్టి అనేకులు పార్టీ కోసం గ్రౌండ్ వర్క్ చేస్తున్నట్లు సమాచారం. తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాడిన నేతలు ఇప్పుడు మరో ఉద్యమం అవసరమని అంటున్నారు. దీనికి టిడిపి అధినేత చంద్రబాబు అండదండలు దండిగా ఉంటాయని అంటున్నారు. ఇదే నిజమైతే రేవంత్ పార్టీ వెనక బాబు హస్తం ఉండే ఉంటుంది. పార్టీ కోసం ఎందాకైనా పోరాడటం రేవంత్ నమ్ముకున్న సిద్ధాంతంగా ఆయన వర్గీయులు చెబుతారు. అదే అతడు వేగంగా ఎదిగేలా చేసిందన్న వాదనలు వినిపిస్తాయి. అతని పనితనమే తెలుగుదేశంలో ఎందరో సీనియర్లను వెనక్కు నెట్టి రేవంత్‌ను టీడీపీ చీఫ్ చంద్రబాబుకు దగ్గర చేసిందంటారు. అతని స్పీడ్ చూసి చంద్రబాబు రాజకీయాల్లో ప్రోత్సహించారని చెబుతారు. ఎమ్మెల్యే గానే కాకుండా పార్టీలో కూడ అతనికి కీలక బాధ్యతలు అప్పగించేవారు. టీడీపీలో ఆయనకు పొలిట్ బ్యూరో సభ్యునిగా, టీటీడీపీకి వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించి బాబు ప్రోత్సహించారు. అయితే రాజకీయ సమీకరణాల్లో టీటీడీపీ వీడి కాంగ్రెస్ లో చేరిన రేవంత్ స్వల్ప కాలంలోనే అధిష్టానానికి దగ్గరయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎమ్మెల్యేగా, ఎంపీగా పోటీచేసే అవకాశం పొందారు. షార్ట్ టైంలో ఏకంగా టీపీసీసీ అధ్యక్షుడు రేసులోకి దూసుకొచ్చారు. అయితే అక్కడ పాతుకుపోయిన నేతలు రేవంత్‌ను అడ్డుకుంటున్నారని స్పష్టంగా కనిపిస్తోంది. నిజానికి ఒక సందర్భంలో టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ పేరు ఖరారు అయిందన్న ప్రచారం జోరుగా జరిగింది. అయితే కాంగ్రెస్‌లోని సీనియర్లు ఏకమై అతని మీద పెద్ద ఎత్తున కాంగ్రెస్ పెద్దలకు ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తోంది. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి కాకుండా మొదటి నుండి ఉన్నవారికి అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలని లేఖలు రాశారని కూడా వార్తలు వచ్చాయి.

అయితే తానేపని చేసినా సొంత పార్టీలోని ఓ వర్గం టా÷-గ్గ÷ట్ చేసి నెగిటివ్ ప్రచారం చేస్తున్నారనే అసహనం రేవంత్ వర్గంలో కనిపిస్తోంది. ఇదే సమయంలో రేవంత్ రెడ్డి తనదారి తాను చేసుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ దశలో తెలంగానలో కూడా రాజకీయంగా బలమైన ప్రతిపక్షంగా పోరాటాలు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయని అంటున్నారు. కొత్త ప్రాంతీయ పార్టీ ఏర్పాటు చేస్తే విద్యార్థి, యువత, నిరుద్యోగులు, టీచర్లు, ఉద్యోగుల మద్దతు ఉంటుందని భావిస్తున్నారు. అలాగే మొన్నటి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నేతలంతా అండగా నిలవడానికి రెడీ అవుతున్నారు. సమీప భవిష్యత్‌లో జిహెచ్ఎంసి ఎన్నికలు రాబోతున్నాయి. 2021 ఫిబ్రవరిలోగా ఎన్నికలు జరిగే అవకాశం ఉంది.

గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని విమర్శకులకు తావివ్వకూడదన్న ప్రణాళికతో రేవంత్ తదితరులు రంగం సిద్ధం చేసుకుంటున్నారని ప్రచారం సాగుతోంది. ఇందులో రేవంత్‌కు అండగా అనేకులు మేము సైతం అని హామీ ఇచ్చారని అంటున్నారు. రేవంత్ రంగంలోకి దిగితే అటు కాంగ్రెస్, టిడిపి శ్రేణులు, కార్యకర్తలు కూడా అండగా నిలుస్తారన్న ప్రచారం సాగుతోంది. మొత్తంగా త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ప్రైవేటు ఉపాధ్యాయుల జీతాలపై స్పందన ఏదీ

ఎన్ని అర్జీలు ఇచ్చినా బుట్ట దాఖలేనా?
రోడ్డున పడ్డ టీచర్లను పట్టించుకోని సర్కార్

అమరావతి,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): కరోనా లాక్‌డౌన్ మార్చి నెలలో ప్రకటించిన తరువాత ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు ప్రైవేట్ ఉపాధ్యాయులకు వేతనాలు లేవు. ఫీజులు వసూలు కాలేదనే నెపంతో ప్రైవేట్ యాజమాన్యాలు వీరికి జీతాలు చెల్లించటం లేదు. వందలాది మంది ఉపాధ్యాయులు జీవనోపాధి కోసం ఉపాధి హామీ పనులకు వెళుతున్నారు. కొంతమంది కూరగాయలు, పండ్లు అమ్ముతున్నారు. ప్రైవేటు ఉపాధ్యాయులకు ఆర్థిక సహాయం అందించాలని, ఆదుకోవాలని కోరుతూ ప్రభుత్వానికి విజ్ఞాపన పత్రాలు అందించటం, పాఠశాల విద్యా నియంత్రణ కమిషన్ చైర్మన్ జస్టిస్ కాంతారావుకి విజ్ఞప్తి చేయటం జరిగింది. ప్రభుత్వం ఇంత వరకు ప్రైవేటు ఉపాధ్యాయుల గురించి నిర్ణయం చేయలేదు.

ఈ వారంలో పాఠశాల విద్య కమిషనర్ ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలు ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్‌జెడిలకు, డిఇవోలకు ఉత్తర్వులు పంపారు. ఇవి అమలు జరగవు. ప్రభుత్వమే ప్రైవేట్ ఉపాధ్యాయులకు ఆర్థిక సహాయం అందించాలన్న వినతులు బుట్టదాలు అయ్యాయి. ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యలో 70 లక్షల మంది పిల్లలు చదువు తున్నారు. వీరిలో 38 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్లో, 32 లక్షల మంది ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల ప్రైవేటు పాఠశాలల్లో లక్షా20వేల మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ప్రైవేటు కళాశాలలో సుమారు లక్షా30వేల మంది అధ్యాపకులు పని చేస్తున్నారు. రాష్ట్రంలో జిల్లా పరిషత్, మండల పరిషత్, ప్రభుత్వ మున్సిపల్ పాఠశాలలలో లక్షా 80వేలమంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్య గత రెండు దశాబ్దాలుగా పెండింగులో ఉండి ప్రమోషన్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. తనిఖీ వ్యవస్థ బలహీనంగా ఉన్నది. ఉపాధ్యాయులు గత మూడేళ్లుగా బదిలీలు లేక బదిలీల కోసం ఎదురు చూస్తున్నారు. సిపియస్, పిఆర్‌సి వంటి సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు పరిష్కరించలేదు. ఆంధ్రప్రదేశ్‌లో అనేక రకాల గురుకులాలు పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నాయి. వీటిలో కస్తూరిబా విద్యాలయాలు, ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలు, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, జ్యోతిరావ్ పూలే బి.సి. గురుకుల పాఠశాలలు, గిరిజన గురుకుల పాఠశాలలు ముఖ్యమైనవి. రాష్ట్రంలో 352 కస్తూరిబా విద్యాలయాలు ఆడపిల్లలకు రెసిడెన్షియల్ విద్య అందిస్తున్నాయి. వీటిలో పని చేసే ఉపాధ్యాయులందరూ కాంట్రాక్ట్ ఉపాధ్యాయులే. ఒకరు కూడా పర్మినెంట్ ఉపాధ్యాయులు లేరు. గిరిజన గురుకులాలలో 1400 మంది ఉపాధ్యాయులు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్నారు. వీరికి గత 6 నెలలుగా జీతాలు లేవు. సాంఘిక సంక్షేమ, బి.సి గురుకుల పాఠశాలల్లో సుమారు 3 వేల మంది పార్ట్-టైం, గెస్ట్ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. వీరికి కూడా గత 6నెలలుగా వేతనాలు లేవు. గురుకులాలన్నింటి సమస్యలను అధ్యయనం చేసి వారిని, ముఖ్యంగా కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ ఉపాధ్యాయులను పర్మినెంట్ చేయాలి. మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయుల జీతాలకు సంబంధించి 010 సౌకర్యం కల్పించాల్సి రాష్ట్రంలో దాదాపు 20 ప్రభుత్వ యూనివర్శిటీలు ఉన్నాయి. వీటిలో ఎప్పటికప్పుడు అధ్యాపక పోస్టులు భర్తీ చేయకపోవటంతో దాదాపు 4 వేలకు పైగా ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దాదాపు 2 వేల మంది కాంట్రాక్టు, గెస్ట్ అధ్యాపకులుగా పని చేస్తున్నారు. వీరికి న్యాయం చేయవలసి ఉంది. ప్రభుత్వం జూనియర్ కళశాలల్లో దాదాపు 3,500 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులుగా 15 ఏళ్లగా పని చేస్తున్నారు. వీరిని క్రమబద్ధీకరించాలి. రాష్ట్రంలో 151 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, 137 ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలు విద్యా రంగానికి ఎన్నో సేవలు అందించాయి. జివో నెం.35 ద్వారా ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల్లో గత రెండు దశబ్దాలుగా పోస్టులు భర్తీ చేయక పోవడం వలన అవి క్షీణించిపోతున్నాయి.

ప్రైవేట్ ఆస్పత్రులపై ఏం చర్యలు తీసుకున్నారు?

ప్రజలకు వారు ఎందుకు సేవ చేయరు
పబ్లిక్ హెల్త్‌పై ఎంత ఖర్చు చేశారో చెప్పండి
కరోనాతో రోజుకు 8 నుంచి 10 మందే చనిపోతున్నారా
రాష్ట్ర సర్కార్ తీరుపై మండిపడ్డ హైకోర్టు
22 వరకు నివేదిక ఇవ్వాలన్న హైకోర్టు
తప్పుడు నివేదికలు ఇస్తే సిఎస్ రావాల్సి ఉంటుందని హెచ్చరిక
విచారణను 24కు వాయిదా వేసిన కోర్టు

హైదరాబాద్,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): ప్రైవేట్ ఆస్పత్రుల కరోనా దోపిడీపై హైకోర్టు మారోమారు మండిపడింది. వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. వారికి బాధ్యత లేదా అంటూ నిలదీసింది. కరోనా పేరుతో దండిగా వసూల్లు చేస్తున్న ప్రైవేటు ఆస్పత్రులపై చర్యలు తీసుకోవడానికి ఎందుకు వెనక్కి తగ్గుతున్నారని హైకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. తెలంగాణలో నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేటు ఆస్పత్రులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. రాయితీలు తీసుకున్న ప్రైవేటు ఆస్పత్రులకు ప్రజలకు సేవ చేసే బాధ్యత లేదా? అని ప్రశ్నించింది. కోవిడ్ పరీక్షల నిర్వహణ,ప్రైవేట్ ఆస్పత్రుల తీరుపై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. ప్రభుత్వ తీరు పట్ల కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రైవేట్ హాస్పటల్ ఓవర్ చార్జీలపై ఈ నెల 22న నివేదిక ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. ఇప్పటివరకు ఎన్ని ప్రైవేటు ఆస్పత్రులకు నోటీసులు ఇచ్చారు.. చర్యలపై నివేదిక సమర్పించాలని తెలిపింది. డిజాస్టార్ మేనేజ్మెంట్ ప్లాన్స్ ఏ విధంగా ఉన్నాయి.. దానితో ఎలాంటి చర్యలు చేపట్టారో తెలపాలని కోర్టు ఆదేశించింది. పబ్లిక్ హెల్త్‌పై మార్చి 24 కు ముందు ఎంత ఖర్చు చేశారు. ఆ తర్వాత ఎంత ఖర్చు పెట్టారో నివేదిక ఇవ్వాలన్నది. అంతేకాక తెలంగాణ కోవిడ్ డెత్ రిపోర్ట్స్‌పై హై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రతి రోజు 8 నుంచి 10 మంది మాత్రమే చనిపోతున్నారా.. అని ప్రశ్నించింది. కేసులు తక్కువ చేసి చూపిస్తున్నారని, మార్చి నుంచి ఇదే విధంగా వ్యవహరిస్తున్నారని కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఖచ్చితమైన రిపోర్టులు సమర్పించాలని.. తప్పుడు నివేదికలు ఇస్తే మళ్లీ సీఎస్‌ని కోర్టుకు పిలువాల్సి వస్తుందని హెచ్చరించింది. ఈ నెల 22వరకు రిపోర్టులన్ని నివేదించాలని సూచించింది. ఆస్పత్రుల్లో సిబ్బంది, మౌళిక సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందుకు సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకున్నారో నివేదిక ఇవ్వాలన్న ధర్మాసనం. తదుపరి విచారణ 24 కి వాయిదా వేసింది. అయితే రాష్ట్రంలో కరోనా నివారణ చర్యలపై ప్రభుత్వం న్యాయస్థానానికి నివేదిక సమర్పించింది. అయితే ప్రభుత్వం ఇచ్చిన నివేదిక నిర్లక్ష్యంగా, అస్పష్టంగా ఉందని హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రభుత్వం కరోనా మృతులపై వాస్తవాలు వెల్లడించలేదనిపిస్తోందని పేర్కొంది. ఆగస్టు 31 నుంచి ఈనెల 4 వరకు జిల్లా బులిటెన్లు సమర్పించాలని, గ్రేటర్‌లో ఐసోలేషన్, కోవిడ్ కేంద్రాల జాబితా ఇవ్వాలని కమిషనర్‌కు హైకోర్టు ఆదేశింది. జిల్లాల నుంచి కోవిడ్ బాధితులు హైదరాబాద్‌కు వచ్చేలా అంబులెన్సుల సు పెంచాలంది. ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేసే ప్రభుత్వ ల్యాబ్‌లు పెంచాలని, వైద్యారోగ్య రంగానికి కేటాయించిన బడ్జెట్ వివరాలు కూడా సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఆస్పత్రుల్లో లైవ్ డాష్ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలని సూచించింది. వీధుల్లో మొబైల్ వ్యాన్ల ద్వారా కరోనా పరీక్షలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ప్రైవేట్ ఆస్పత్రులపై విచారణ జరపాలని జాతీయ ఫార్మా ధరల సంస్థకు హైకోర్టు ఆదేశించింది. ఈనెల 22లోగా విచారణ నివేదిక సమర్పించాలని ఎన్‌పీపీఏకు న్యాయస్థానం ఆదేశించింది. నివేదిక రాగానే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పీహెచ్ డైరెక్టర్‌కు సూచించింది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో సగం పడకలు రిజర్వు చేస్తారా? లేదా? అన్నది తెలపాలంది. మీడియా కథనాలకు.. ప్రభుత్వ నివేదికలకు పొంతన లేదంటూ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. జిల్లాల వారీగా నివేదికలు తెప్పించాలని చెప్పినా ఎందుకు పట్టించుకోవడం లేదని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వం కరోనా మృతులపై వాస్తవాలు వెల్లడించలేదనిపిస్తోందని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఆగస్టు 31 నుంచి ఈనెల 4 వరకు జిల్లా బులిటెన్‌లను సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. ఈనెల 22లోగా నివేదిక సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను హైకోర్టు ఈనెల 24కు వాయిదా వేసింది.

గవర్నర్ తమిళసైకి రాష్ట్రపతి కోవింద్ ఫోన్

-జాతీయ విద్యావిధానం,కరోనాలపై ఆరా

హైదరాబాద్,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): ప్రస్తుతం తెలంగాణలో కరోనా పరిస్థితులను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ గవర్నర్ తమిళ సైని అడిగి తెలుసుకున్నారు. అలాగే తెలంగాణ ప్రజలు సురక్షితంగా ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ గవర్నర్ తమిళిసైతో శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారు. ఈసందర్భంగా ఈనెల 7వ తేదీన జాతీయ నూతన విద్యాపాలసీ-2020 పై రాష్ట్రపతి అన్నిరాష్ట్రాల గవర్నర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఈనేపథ్యంలో ఆయన గవర్నర్‌కు ఫోన్‌చేసి మాట్లాడ్డం ప్రాధాన్యత సంతరించుకుంది.అలాగే కరోనా పై కూడా రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ చర్చించారు. కాగా రాష్ట్రపతి వీడియో కాన్ఫరెన్స్‌లో చర్చించే అంశాల్లో ప్రధానంగా జాతీయ ఎడ్యుకేషన్‌పాలసీతో పాటు నాణ్యమైన విద్యా అన్నివర్గాలకు అందాలన్న విషయం పై ఇరువురూ చర్చించినట్టు గవర్నర్ కార్యాలయం వెల్లడించింది. రాష్ట్రపతి వీడియో కాన్ఫరెన్స్ సమయంలో అన్నిరాష్ట్రాల గవర్నర్లు, విద్యాశాఖ మంత్రులు, ఆయా రాష్ట్రాల యూనివర్శిటీల వైస్‌ఛాన్సలర్స్‌తో కూడా ఇంటరాక్ట్ అవుతారు. రాష్ట్రపతి వీడియో కాన్ఫరెన్స్ ప్రధానంగా జాతీయ విద్యాపాలసీ-2020 పై అవసరమైన అవగాహన కల్పించడంతోపాటు, ప్రపంచస్థాయి ప్రమాణాలకు అనుగుణంగా విద్యావిధానాన్ని అమలుచేయడం వంటి అంశాలపై చర్చిస్తారు. ఆర్థికపరమైన విజ్ఞానాన్నిపెంపొందిండం, ఇండియాను నాలెడ్జ్ సూపర్ పవర్‌గా తీర్చిదిద్దడమేనని తెలిపారు. ఈసందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో ఉన్నత విద్యారంగం తీరు తెన్నులను గవర్నర్ తమిళిసై రాష్ట్రపతికి వివరించారు. ఇప్పటికే పలువురు విద్యాప్రముఖులతో, మరో ఇద్దరు యూజీసీ సభ్యులతో వెబ్‌నార్ నిర్వహించి వారి సలహాలు సూచనలు తీసుకున్నట్టు వివరించారు. అలాగే జాతీయ విద్యాపాలసీపై తాను నిర్వహించిన వెబ్‌నార్‌ల ద్వారా తీసుకున్నసలహాలు, సూచనలతో సమగ్ర నివేదికను కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ, రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసినట్టు చెప్పారు.

ఏడుగురు కూలీల దుర్మరణం

రాయ్‌పూర్,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కూలీలతో వెళుతున్న బస్సు చెరీఖడీ దగ్గర ఒక ట్రక్కును ఢీకొని బోల్తాపడింది. ఈ ఘటనలో ఏడుగురు కూలీలు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ బస్సు ఒడిశాలోని గంజాం నుంచి గుజరాత్ వెళుతోంది. రాయపూర్ ఎస్ఎస్పీ అజయ్ యాదవ్ మాట్లాడుతూ ఒడిశాలోని గంజాం నుంచి గుజరాత్‌లోని సూరత్ వెళుతున్న బస్సు రాయపూర్‌లో ప్రమాదానికి గురయ్యిందన్నారు. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందగా, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారన్నారు. గాయపడినవారిని ఆసుపత్రికి తరలించామని, అక్కడ వారు చికిత్స పొందుతున్నారని తెలిపారు. మృతులను ఇంకా గుర్తించాల్సివుందన్నారు. ప్రస్తుతం పోలీసులు సంఘటనా స్థలంలో పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు.

అనాథ చిన్నారులకు కెటిఆర్ అండ

కరీంనగర్,సెప్టెంబర్5 (నేటినిజం ప్రతినిధి):: అమ్మానాన్నలు లేరని అధైర్యపడొద్దు.. పిలిస్తే మేమం తా పలుకుతాం.. ఎప్పుడు ఏ సాయం కావాలన్నా చేస్తాం' అని మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అనాథ చిన్నారులకు భరోసా కల్పించారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం ఎరడపల్లికి చెందిన నాగుల శారద-రమేశ్ దంపతులు మరణించడంతో పిల్లలు ఆలయ(9), అభినయ(11) అనాథలుగా మారారు. ఈ విషయాన్ని పూర్ణారావు అనే వ్యక్తి ట్విట్టర్ ద్వారా మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి బాలికలకు

అండగా నిలుస్తామని ప్రకటించారు. చిన్నారులకు సాయంచేయాలని కలెక్టర్ శశాంకకు ట్వీట్ చేశారు. దీంతో ఆయన శుక్రవారం ఎరడపల్లికి వెళ్లి, ప్రభుత్వం తరపున సాయం చేస్తామని భరోసా కల్పించారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

హైదరాబాద్,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): గంజాయిని తరలిస్తున్న ముగ్గురిని బాలానగర్ ఎక్సైజ్ పోలీసులు శనివారం మధ్యాహ్నం అరెస్టు చేశారు. నిందితుల నుంచి 327 కిలోల గంజాయి, బైక్, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విశాఖ నుంచి హైదరాబాద్ మీదుగా గురుగ్రామ్‌కు గంజాయిని తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. 3 ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీల ద్వారా తరలిస్తుండగా గంజాయిని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. గంజాయి తరలింపునకు సంబంధించి ముగ్గురిని అరెస్టు చేయగా, మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు ఎక్సైజ్ పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రత్యేక పరిస్థితుల్లో అసెంబ్లీ సమావేశాలు

కరోనాతో ముందు జాగ్రత్తలతో నిర్వహణ
మాస్కు ఉంటేనే సభలోకి అనుమతి
ఎవరికి వారు వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాల్సిందే
అసెంబ్లీ స్పీకర్ పోచారం స్పష్టీకరణ

హైదరాబాద్,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): ప్రత్యేక పరిస్థితుల్లో అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు జరగబోతు న్నాయని అందువల్ల ఎవరికి వారు కరోనా జాగ్రత్తల తీసుకుని రావాలని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సమావేశాలకు వచ్చే వారందరూ పూర్తిగా అప్రమత్తంగా ఉండి, కరోనా పరీక్షలు చేయించుకోవాలని స్పీకర్ సూచించారు. సమావేశాల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. మాస్కు ఉంటేనే సభలోకి అనుమతి ఉంటుందని తేల్చి చెప్పారు. జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలు ఉంటే అసెంబ్లీ ప్రాంగణంలోకి అనుమతించరని కూడా తేల్చారు. శరీర ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటేనే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు అధికారులు, సిబ్బంది, పోలీసులు, మీడియా ప్రతినిధులు, మంత్రుల పీఎస్‌లు, పీఏలు తప్పనిసరిగా కొవిడ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు కొవిడ్ పాజిటివ్ తేలితే అసెంబ్లీ ప్రాంగణంలోకి రావొద్దని స్పీకర్ విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేల పీఏలను అసెంబ్లీ ప్రాంగణంలోకి అనుమతిం చరని స్పీకర్ తెలిపారు. అన్ని ప్రవేశాల వద్ద థర్మల్ స్క్రీనర్లు ఏర్పాటు చేశామన్నారు. సమావేశాల నిర్వహణకు సంబంధించి సీఎస్ సోమేశ్ కుమార్, ఉన్నతాధికారులు, పోలీసులతో చర్చించామని పేర్కొన్నారు. గత సమావేశాలు వేరు, కొవిడ్ సమయంలో జరుగుతున్న ఈ సమావేశాలు వేరు అని స్పీకర్ అన్నారు. కరోనా నుంచి ఇంకా బయటపడలేదు. సీఎం కేసీఆర్ తగు చర్యలు తీసుకోవడం వల్ల రాష్ట్రంలో మరణాల సంఖ్య తగ్గిందన్నారు. కొవిడ్ బారినపడే వారి సంఖ్య ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలో తగ్గిందని స్పీకర్ స్పష్టం చేశారు. కరోనా నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని.. పార్లమెంటు ఇచ్చిన గైడ్ లైన్స్ ప్రకారమే సమావేశాలు జరిపేలా చర్యలు తీసుకుంటున్నామని శాసనసభా వ్యవహారా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చెప్పారు. అసెంబ్లీ హాల్ వద్ద అధికారులకు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పలు సూచనలు ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు కావాల్సిన ఏర్పాట్లను చేస్తున్నామని, సీఎస్ ఆధ్వర్యంలో అన్ని శాఖలను సమన్వయం చేస్తున్నామన్నారు. మరోవైపు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల

నుంచి అసెంబ్లీ ఆవరణలో కరోనా టెస్టులు చేయడం ప్రారంభించామని మంత్రి ప్రశాంత్ రెడ్డి చెప్పారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, వారి సిబ్బంది, మీడియా ప్రతినిధులకు కరోనా టెస్టులు చేస్తామన్నారు. ఎమ్మెల్యే లు బయట చేయించుకున్నా సరే.. నెగటివ్ రిపోర్ట్ చూపిస్తేనే అసెంబ్లీలోకి అనుమతిస్తామన్నారు. లాబీల్లోకి, మంత్రుల ఛాంబర్‌లోకి మీడియా ప్రతినిధులకు అనుమతి లేదన్నారు. గ్యాలరీలోకి మాత్రమే మీడియా అనుమతించే అవకాశం ఉందన్నారు. కరోనా నేపథ్యంలో సోషల్ డిస్టెన్స్ అమలయ్యేలా చేస్తామని.. మీడియా పాయింట్‌ను కూడా ఎత్తి వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అసెంబ్లీ, మండలి హాల్‌లో 6 అడుగుల దూరం వచ్చే విధంగా సీట్లు ఏర్పాటు చేసామని.. శాసనసభలో కొత్తగా 40 సీట్లు, కౌన్సిల్‌లో 8 ఏర్పాటు చేసామన్నారు. కొరొనా కట్టడి విషయములో సర్కార్ అన్ని చర్యలు తీసుకుంటుందని.. ప్రైవేట్ హాస్పిటల్స్ కంటే ప్రభుత్వ హాస్పిటల్స్‌లలో రికవరీ రేట్ ఎక్కువగా ఉందన్నారు. అసెంబ్లీ కి వచ

ఫిష్ హబ్‌గా తెలంగాణ రాష్ట్రం

-ఎంపీపీ బూర వజ్రమ్మ బాబు

వేములవాడ, సెప్టెంబర్ 5 (నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టుల నిర్మాణంవల్ల

తెలంగాణ రాష్ట్రం ఫిష్ హబ్ మారిందని వేములవాడ అర్బన్ మండలం ఎంపీపీ బూర వజ్రమ్మ బాబు అభివర్ణించారు. శనివారం మత్స్య శాఖ వారి సమీకృత మత్స్య అభివృద్ధి పథకం ద్వారా వేములవాడ మండలం చంద్రగిరి గ్రామం లోనితె ట్టె కుంట చెరువు లో ఎంపీపీ చేప పిల్లలను విడుదల చేయడం జరిగింది ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే రమేష్ బాబు ఆదేశాల మేరకు మండలంలోని ప్రతి చెరువులో విడుదల చేస్తున్నామని అన్నారు . రాష్ట్రంలో మిషన్ కాకతీయ కార్యక్రమం ద్వారా చెరువులలో పూడికలను తొలగించి, చేపల పెంపకానికి అనువుగా మార్చి, మత్స్యకార్మికారులు ఆర్థికంగా ఎదగడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి తోడ్పాటును అందించారని అన్నారు. చేప పిల్లలను వేయడం మాత్రమే కాకుండా, మత్స్య కారుల అభివృద్ధికి మెపెడ్ వాహనలు, ఐస్ బాక్సులు మరియు ఐచర్ వ్యాన్ లను అందించడంతో పాటు చేపల అమ్మకానికి వీలుగా చేపల మార్కెట్ లను కూడా ఏర్పాటు చేయడం జరిగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్క వర్గాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ఆలోచనతో ముందుకు తీసుకువెల్లుచున్న రాష్ట్ర ముఖ్యమంత్రికి మత్స్య కారుల తరపున ప్రత్యేక దన్యవాదాలు తెలియజేశారు.

మత్స్య కారుల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వ చేప పిల్లను ఇవ్వడమే కాకుండా, అభివృద్ధి పూర్తి సహయ సహకారాలను అందించడం జరుగుతుందని అన్నారు

ఈ కార్యక్రమంలో జెడ్ పి టి సి మాకల రవి , వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం హనుమాన్లు , చంద్రగిరి చిర్లవంచ సర్పంచులు మత్స్య కార్మికుల శాఖ డి ఈ,ఎంపీడీవో నరేష్ ఆనంద్ , తదితరులు పాల్గొన్నారు

రష్యా వ్యాక్సిన్‌తో మంచి ఫలితాలు

-మెడికల్ జర్నల్ లాన్సెట్ వెల్లడి

మాస్కో, సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): స్పుత్నిక్ వీ పేరుతో రష్యా అభివృద్ధి చేసిన కోవిడ్-19 వ్యాక్సిన్ ఆరంభ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు రాబట్టిందని మెడికల్ జర్నల్ లాన్సెట్ పేర్కొంది. ఈ వ్యాక్సిన్ పరీక్షలో పాల్గొన్న వారందరిలో కరోనా వ్యాక్సిన్‌ను నిరోధించే యాంటీబాడీలు ఉత్పత్తయ్యాయని తెలిపింది. స్పుత్నిక్-వీ పనితీరుపై విమర్శకులకు ఈ పరీక్షలో వెల్లడైన అంశాలే సమాధానమని రష్యా వ్యాఖ్యానించింది. ఈ ఏడాది జూన్-జులైలో వ్యాక్సిన్‌పై నిర్వహించిన రెండు దశల పరీక్షలో పాల్గొన్న 76 మందిలోనూ కోవిడ్-19ను ఎదుర్కొనే యాంటీ బాడీలు అభివృద్ధి చెందాయని, ఏ ఒక్కరిలోనూ తీవ్ర సైడ్ఎఫెక్ట్స్ కనిపించలేదని లాన్సెట్ పేర్కొంది. ప్రపంచంలోనే తొలి కరోనా వ్యాక్సిన్‌గా చెబుతున్న ఈ వ్యాక్సిన్‌కు ఆగస్ట్‌లోనే దేశీయ వినియోగానికి రష్యా అనుమతించిన సంగతి తెలిసిందే. కోవిడ్-19 నుంచి రక్షణ కల్పిస్తూ దీర్ఘకాల భద్రత, సమర్థతల గురించి నిర్ధారణ చేసుకునేందుకు స్పుత్నిక్ వీ వ్యాక్సిన్‌పై భారీస్థాయిలో సుదీర్ఘ పరీక్షలు అవసరమని లాన్సెట్ పేర్కొంది. కాగా ఈ వ్యాక్సిన్ పూర్తిస్థాయిలో పరీక్షలు చేపట్టి, అంతర్జాతీయంగా ఆమోదం లభించే వరకూ స్పుత్నిక్ వీని వాడరాదని పలువురు నిపుణులు హెచ్చరించారు. అయితే అంతర్జాతీయ పత్రిక లాన్సెట్‌లో తొలిసారిగా రష్యన్ వ్యాక్సిన్ ప్రయోగ ఫలితాలు ప్రచురించడం, 40,000 మందిపై గతవారం పరీక్షలు నిర్వహించిన నేపథ్యంలో తమ వ్యాక్సిన్‌పై అనుమానాలు పటాపంచలవుతాయని సీనియర్ రష్యన్ అధికారి వ్యాఖ్యానించారు. మరోవైపు కోవిడ్-19 నిరోధానికి తొలి వ్యాక్సిన్‌ను ప్రకటించిన రష్యా భారీస్థాయిలో వ్యాక్సిన్ తయారీకి సన్నద్ధమవుతోంది. సంవత్సరం చివరి నాటికి నెలకు 20 లక్షల డోసులను ఉత్పత్తి చేస్తూ క్రమంగా నెలకు 60 లక్షల డోసులకు సామర్థ్యాన్ని పెంచుతామని పరిశ్రమల మంత్రి డెనిస్ మంతురోవ్ వెల్లడించారు

ఇంతటి అసమర్థ సర్కార్‌ను చూడలేదు

ప్రైవేట్ ఆస్పత్రులతో కెసిఆర్ లాలూచీ
మండిపడ్డ కాంగ్రెస్ నేతలు ఉత్తమ్,భట్టి

హైదరాబాద్,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): గవర్నర్, హైకోర్టు తిట్టినా సీఎం కేసీఆర్‌కు సిగ్గులేదన్నారు టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి. కరోనా మరణాలపై తప్పుడు రిపోర్ట్ లు ఇస్తున్నట్టు హైకోర్టు చెప్పిందని..యశోద ఆసుపత్రిలో కేసీఆర్ వాటా ఎంత? అని ప్రశ్నించారు. ప్రవేటు ఆసుపత్రులతో సీఎం కేసీఆర్ లాలూచీ పడుతున్నాడని ప్రాజెక్ట్ లల్లో కమీషన్ కోసం దోచుకొన్నది చాలదా కేసీఆర్..? అన్నారు. ఇంత దరిద్రపు ప్రభుత్వాన్ని నేను ఎప్పుడు చూడలేదని..ఇదో ముదనష్టపు ప్రభుత్వం అన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో తప్పుడు రిపోర్ట్‌లు ఇవ్వమని చెప్పినందుకు హుజురాబాద్‌లో ప్రవీణ్ యాదవ్ ఉద్యోగం తీశారని సూసైడ్ చేసుకున్నాడని తెలిపారు. ప్రవీణ్ యాదవ్‌ను ఈటల రాజేందర్ ఆసుపత్రి సూపర్డేంట్‌లే చంపించారన్నారు. ఈటల రాజేందర్ పై కేసులు పెట్టాలని..ఈటల రాజేందర్ నియోజకవర్గం హుజురాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో సగం సిబ్బంది కూడా లేరన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని గాలికి వదిలేశారని జిల్లాకో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కడతాం అన్నావ్ ఏమైంది..? అని కేసీఆర్‌ను ప్రశ్నించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస వసతులు లేవని, సరిపోను సిబ్బంది లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. ఇప్పుడున్న అరకొర సిబ్బంది మాత్రమే రేయింబవళ్లు పని చేస్తున్నారని, వారికి కృతజ్ఞతలు తెలిపారు. గత నెల ఆగస్టు 26 నుంచి తమ పార్టీ ఎమ్మెల్యేలు కలసి ప్రభుత్వ ఆసుపత్రుల ను సందర్శించామని ఆయన అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నిర్మించిన ఆసుపత్రులే తప్ప.. ఆరున్నర ఏండ్లలో కొత్తగా ఒక్క ఆసుపత్రిని కూడా ప్రభుత్వం కట్టలేదన్నారు.. ఆరున్నర ఏండ్ల నుంచి ప్రభుత్వం గాడిదలు కాస్తుందా? అని ఘాటుగా ప్రశ్నించారు. ప్రభుత్వ ఆసుపత్రుల పై ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్ని అబద్దాలే చెబుతున్నా రన్నారు. కేసీఆర్, ఈటల రాజేందర్‌ను ఉత్సవ విగ్రహంగా పెట్టాడన్నారు. పేద ప్రజలు కరోనా తో ఇబ్బందులు పడుతున్నారని, ఐసోలేషన్ ఏర్పాటు చేయకపోవడం వల్ల గ్రామాల్లో వైరస్ వ్యాప్తి చెందుతుందని అన్నారు. యశోద లాంటి ప్రైవేట్ ఆసుపత్రులు జలగల మాదిరిగా ప్రజల రక్తం తాగుతుంటే ప్రభుత్వం ఎందుకు ఆపలేకపోతున్నదని భట్టి ప్రశ్నించారు. అధికారుల కమిటీ వేసి అడ్డుకోవాలని అన్నారురాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తుందని, ప్రభుత్వ ఆస్పత్రులపై గవర్నర్ ను కలుస్తామని భట్టి.అన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే కోర్ట్ కు కూడా వెళ్తామన్నారు. వచ్చే శాసనసభలో ప్రభుత్వ ఆసుపత్రులపైన చర్చించాలని కోరుతామన్నారు. అవసరమైతే స్పీకర్ ను కలుస్తామని చెప్పారు.

తెలంగాణలో టీచర్ల పరిస్థితి దారుణం

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న కెసిఆర్
మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్

హైదరాబాద్,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): అసమర్థ టీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వాకం వల్ల తెలంగాణలో ఉపాధ్యాయుల దుస్థితి తలచుకుంటే గుండె తరుక్కుపోతుందన్నారు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్. శనివారం టీచర్స్ డే సందర్భంగా మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దుస్థితి గురించి చెప్పుకొచ్చారు. ప్రీప్రైమరీ స్కూల్ టీచర్ నుంచి ఇంజనీరింగ్ కాలేజ్ లెక్చరర్ వరకు ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవాళ్లు.. ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగులు అన్న తేడా లేకుండా అనేక కష్టాలకు గురవుతున్నారన్నారు. 'గురు బ్రహ్మ గురు విష్ణు..' అంటూ భారతీయ సనాతన ధర్మం గురువును దేవుని స్థానంలో నిలబెట్టిందన్నారు. పూజ్యనీయ స్థానం అటుంచితే టీఆర్ఎస్ సర్కార్ అసమర్థత వల్ల టీచర్లు కనీసం మనుషులుగానూ జీవించలేకపోతున్నారని.. పూటగడవడానికే ఇబ్బందులనెదుర్కొంటూ దారుణంగా బతుకులు ఈడుస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా టీఆర్ఎస్ ప్రభుత్వం మొండిపట్టుదల వీడి లాక్ డౌన్ వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న టీచర్లకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలన్నారు. ఎన్నికల ముందు, అధికారంలోకి వచ్చాక టీచర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని.. టీచర్ల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు భారతీయ జనతా పార్టీ వారి పక్షాన పోరాడుతుందని, వారికి అండగా ఉంటుందని హామీ ఇస్తున్నానన్నారు కరోనా మహమ్మారి విలయతాండవం చేస్తున్న తరుణంలో వైరస్‌ను కట్టడి చేసేందుకు తప్పనిసరి పరిస్థితుల్లో స్కూళ్లు, కాలేజీలు సహా విద్యాసంస్థలను బంద్ పెట్టాల్సి వచ్చిందని.. స్కూళ్లు, కాలేజీల్లో తరగతులు నడవడం లేదని ప్రైవేటు యాజమాన్యాలు టీచర్లు, లెక్చరర్లకు జీతాలు సగానికి పైగా కోత పెడుతున్నాయన్నారు. కొన్ని సంస్థలయితే అసలు మొత్తానికే జీతాలు ఇవ్వడం లేదు. చేతిలో చిల్లిగవ్వ లేక, రోజు గడవడమే గగనంగా మారి రాష్ట్రంలో టీచింగ్ ఫీల్డ్ లో ఉన్నవాళ్లు, వారి కుటుంబీకులు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావన్నారు. ఎన్నికల వేళ టీచర్లకు అది చేస్తాం.. ఇది చేస్తాం అని వరాలు గుప్పించే సీఎం కేసీఆర్ ఈ కష్టకాలంలో వారిని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. జీతాలు రాక, చేతిలో డబ్బులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న టీచర్లను, లెక్చరర్లను ఆదుకోవాలన్న సోయి ఈ టీఆర్ఎస్ ప్రభుత్వానికి లేకపోయిందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రైమరీ స్కూల్ టీచర్ నుంచి యూనివర్సిటీ ప్రొఫెసర్ల వరకు బోధన సిబ్బందిలో అనేక ఖాళీలు ఉన్నాయని వీటిని భర్తీ చేయకపోవడంతో ఉన్న సిబ్బందిపైనే విపరీతమైన భారం నెడుతున్నారన్నారు. నియామకాలు చేపట్టాల్సిందిగా యువత, నిరుద్యోగులు గొంతు చించుకుంటుంటే చెవిటివాని ముందు శంఖం ఊదిన చందంగానే మారింది కానీ తోలుమందం రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేదన్నారు. ఈ నియామకాలు చేపడితే యువతకు ఉద్యోగాలు దక్కడమే కాకుండా? రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు దోహదపడుతుందన్నారు. కానీ సీఎం కేసీఆర్ నియామకాల ఉసే ఎత్తొద్దంటూ భీష్మించుకు కూర్చున్నారని తెలిపారు.

హరీష్‌రావుకు కరోనా పాజిటివ్

అసెంబ్లీ సమావేశానికి దూరం కానున్న మంత్రి
త్వరగా కోలుకోవాలని మంత్రి కెటిఆర్ ట్వీట్

హైదరాబాద్,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్ర ఆర్థికమంత్రి హరీశ్ రావుకు కరోనా పాజిటివ్‌గా తేలింది. ఈ నెల 7 నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల దృష్ట్యా నిర్వహించిన కరోనా పరీక్షల్లో హరీశ్‌కు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా తన ట్విట్టర్ ద్వారా తెలిపారు. తనకు కరోనా లక్షణాలు స్వల్పంగా ఉన్నాయని.. టెస్టులో పాజిటివ్‌గా తేలిందన్నారు. తాను ఆరోగ్యంగా బాగానే ఉన్నానని ట్విట్టర్‌లో తెలిపారు. ఇటీవల తనను కలిసిన ప్రజాప్రతినిధులు, అధికారులను టెస్టులు చేయించుకోవాలని సూచించారు. అయితే కరోనా పాజిటివ్ నేపథ్యంలో ఆయన సోమవారం నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలకు దూరం కానున్నారు. ఇటీవల పలు కార్యక్రమాల్లో బిజీగా తిరగడం వల్లనే పాజిటివ్ వచ్చినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ఆర్థికమంత్రి హరీశ్ రావుకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో ఆయన త్వరగా కోలుకోవాలంటూ పలువురు ట్విట్టర్ వేదికగా అభిలషించారు. హరీశ్ ట్వీట్‌పై స్పందించిన పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్... 'బావా త్వరగా కోలుకో.. ఇతరులకంటే త్వరగా కోలుకుంటావన్న నమ్మకం నాకుంది' అని ట్వీట్ చేశారు. సోమవారం నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు కరోనా పరీక్షలు చేయించుకున్నారు. ఆ పరీక్షల్లోనే హరీశ్‌కు పాజిటివ్‌గా తేలింది.

మహిళల రక్షణలో రాజీలేదు

-జిల్లా ఎస్పీ రంగనాథ్

నల్లగొండ,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): మహిళల రక్షణళి ప్రధాన లక్ష్యంగా తెలంగాణ పోలీస్ శాఖ ఆధునిక సౌకర్యాలతో దేశంలోనే అగ్ర స్థానంలో నిలిచిందని జిల్లా ఎస్పీ ఏవీ రంగనాథ్ అన్నారు. శుక్రవారం ఎం.టి. ఇన్ స్పెక్టర్ స్పర్జన్ రాజ్ నేతృత్వంలో జిల్లా అదనపు ఎస్పీ నర్మద, డిటిసి అదనపు ఎస్పీ సతీష్ చోడగిరితో కలిసి షీ టీమ్ పోలీస్ సిబ్బందికి కేటాయించిన 20 వాహనాలను డీఐజీ, ఎస్పీ రంగనాథ్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళల రక్షణ విషయంలో రాజీ లేకుండా పని చేస్తూ ఈవ్ టీజింగ్, లైంగిక వేధింపులు, మహిళల పట్ల దాడుల లాంటి నేరాల సంఖ్యను తగ్గించే విధంగా సమర్థవంతంగా పని చేస్తున్నామని తెలిపారు. మహిళల రక్షణ విషయంలో తెలంగాణ పోలీస్ శాఖ దేశంలోనే అగ్ర స్థానంలో ఉన్నదని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణకు తొలి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు అందుకు అవసరమైన రీతిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. మహిళా పోలీస్ అధికారులకు కేటాయించిన ఈ వాహనాల ద్వారా ఇకపై మహిళల రక్షణకు సంబంధించి సంఘటనా స్థలాలకు మరింత త్వరగా చేరుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. జిల్లాలో మహిళల రక్షణ కోసం షీ టీమ్స్ నిరంతర నిఘాతో పాటు అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తూ వారిని చైతన్యం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నల్లగొండ డీఎస్పీ వెంకటేశ్వర్ రెడ్డి, ఇన్ స్పెక్టర్ స్పర్జన్ రాజ్, ఆర్.ఐ. వైవీ ప్రతాప్, సిఐలు సురేష్, బాషా, ఎం.టి. సిబ్బంది లియాఖత్, తదితరులు పాల్గొన్నారు.

కరోనా సమస్యలపై పట్టింపు లేని సర్కార్

-నిజామాబాద్ ఎంపీ అరవింద్

నిజామాబాద్,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): కరోనా నేపథ్యంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని నిజామాబాద్ ఎంపీ అరవింద్ అన్నారు. శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై మాట్లాడారు. రోజురోజుకీ రాష్ట్రంలో కరోనా కేసులు పెరిగిపోతున్నాయని.. కేసీఆర్ సర్కార్ కరోనా బాధితులకు ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలని అన్నారు. ప్రైవేటు ఆసుపత్రులు లక్షల్లో బిజులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు మొక్కజొన్న కొనుగోళ్ళపై క్లారిటీ ఇవ్వలేదన్నారు అరవింద్. దేశం లోనే మూడో ప్రథమ పంట అయిన మొక్కజొన్నకు ..కేంద్రం 80 రూపాయలు పెంచి మద్దతు ధర 1850 చేసిం దని..అయినా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకఎొవడం శోచనీయమని అన్నారు.దాదాపు 11 వందల కోట్ల విలువైన నాలుగు మిలియన్ టన్నుల మొక్కజొన్నను ఎగుమతి చేశామన్నారు . జాతీయ, అంతర్జాతీయంగా డిమాండ్ పెరుగుతున్నా కేసీఆర్ మాత్రం మొక్కజొన్న కు ధర లేదంటున్నారని అరవింద్ విమర్శించారు. దేశం లో ఓపెన్ మార్కెట్ లో ధర రూ.2300 ఉంటే మన రాష్ట్రం లో ధర 1250 ఎందుకుంటుందని ఆయన ప్రశ్నించారు.పెద్ద వ్యాపారులతో కుమ్మక్కై అతి పెద్ద కుంభకోణం జరుగుతుందని ఆరోపించారు. కేసీఆర్ అవినీతి ఆపెస్తే రైతుల ఆత్మహత్యలు తగ్గుతాయని చెప్పారు ఎంపీ. దేశంలో రైతుల ఆత్మహత్యల్లో రాష్ట్రం ఐదో స్థానం లో ఉందన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని 36 రాష్ట్రాల్లో 32 రాష్ట్రాల్రు అమలు చేస్తుండగా.. తెలంగాణ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అమ్మ పెట్టదు అడుక్కు తిననీయదన్నట్టుగా మోదీకి పేరు రాకూడదని కేసీఆర్ ఆయుష్మాన్ భారత్ ను అమలు చేయడం లేదన్నారు.

వర్షాలతో నష్టపోయిన వారిని ఆదుకోవాలి: వివేక్

మంచిర్యాల,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలన్నారు బీజేపీ నాయకులు, మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి. వారి ఖాతాలలో ఎకరానికి రూ.30 వేల చొప్పున నష్టపరిహారాన్ని జమ చేయాలని డిమాండ్ చేశారు. శనివారం జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గం కొటపల్లి మండలం అన్నారం గ్రామంలో ఇటీవలి ప్రాణహిత వరద వల్ల ముంపునకు గురైన పంటలను వివేక్ పరిశీలించారు. నష్టపోయిన రైతులను పరామర్శించి, వివరాలు తెలుసుకున్నారు.

అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ లో లోపం వల్లే రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. 35 వేల కోట్ల రుపాయల ప్రాజెక్ట్ ను సీఎం కమీషన్ల కోసం లక్ష కోట్లకు పెంచాడని.. కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చాడన్నారు. నష్ట పోయిన రైతులను ప్రభుత్వం అన్నీ విధాలుగా ఆదుకోవాలని, కౌలు రైతులకు నష్ట పరిహారం అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వివేక్ అన్నారు.

వాటర్ ట్యాంక్ లో 10వేల అక్రమ మద్యం బాటిల్స్

-ఏపీలో రోజురోజుకి పెరిగిపోతున్న అక్రమ మద్యం రవాణా

అమరావతి,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): ఏపీలో అక్రమ మద్యం రవాణా రోజురోజుకి పెరిగిపోతుంది. ఏపీలో మద్యం ధరలు ఆకాశాన్ని అంటుతుండటంతో అక్రమ రవాణా దారులు పక్క రాష్ట్రం నుండి తక్కువ ధరకి తీసుకువచ్చి ఏపీలో అమ్ముకుంటూ సొమ్ముచేసుకుంటున్నారు. దీనికి అధికారులు చెక్ పెట్టాలని ఎంతగా చూస్తున్నప్పటికీ కూడా అది కుదరడంలేదు. అక్రమ మద్యం రవాణా దారులు రోజుకొక రీతిలో మద్యం దందా కొనసాగిస్తున్నారు. కొరియర్ పార్సిల్ సర్వీసుల ద్వారా భారీగా అక్రమ లిక్కర్ దందా జరుగుతున్నట్టు ఏపీ స్పెషల్ ఎన్ ఫోర్స్ మెంట్ పోలీసులు గుర్తించారు. ఎన్నికల హామీల్లో భాగంగా రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేదానికి పూనుకున్న ప్రభుత్వం .. దశల వారీగా మద్యాన్ని రాష్ట్రం నుండి పారదోలాలని వ్యూహాన్ని సిద్ధం చేసింది. అందులో భాగంగానే మద్యం ధరలు భారీగా పెంచింది. అయితే ఇది అక్రమ మద్యం రవాణా దారులకి మంచి అవకాశంగా మారింది. రాష్ట్రంలో ధరలు భారీగా పెరగడంతో పక్క రాష్ట్రాల నుండి భారీగా మద్యం రాష్ట్రంలోకి వస్తుంది. అధికారులు ఎంత నిఘా పెడుతున్నప్పటి కూడా అక్రమ మద్యం రాష్ట్రంలోకి రావడం మాత్రం ఆపడం కష్టం అవుతుంది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం ధరలు కూడా తగ్గించింది. కానీ ఇంకా అక్రమ మార్గాలలో మద్యం రవాణా అవుతూనే ఉంది. అక్రమ మద్యం పట్టుబడుతూనే ఉంది. ఇక తాజాగా పెద్ద వాటర్ ట్యాంక్ లో భారీగా తెలంగాణా మద్యం పట్టుబడింది .అమరావతి మండలం మునగోడులో భారీగా మద్యం పట్టుకున్నట్టు ఎస్ఈ బీ అధికారులు చెప్పారు. వాటర్ ట్యాంకులో దాచిన 10 వేల తెలంగాణ మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే మద్యం దాచిన ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. కాగా లాక్ డౌన్ నేపథ్యంలో మద్యం అ?మ్మకాలపై ఏపీ ప్రభుత్వం ఆంక్షలు విధించినప్పటికీ కొందరు అక్రమంగా రాష్ట్రాల సరిహద్దులు దాటి సరఫరా చేస్తున్నారు. అంతేకాకుండా కొంతమంది వ్యాపారులు ఏకంగా కొరియర్ సెంటర్లను కేంద్రంగా చేసుకుని అక్రమ మద్యం దందా చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఏపీకి వస్తున్న వాహనాల మీద పోలీసులు నిఘా పెట్టి వాహన తనిఖీలు చేస్తున్నా పోలీసుల కళ్లుగప్పి లిక్కర్ మాఫియా రేచ్చిపోతూనే ఉంది. ఎస్ ఈ బీ అధికారులు లిక్కర్ అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారు ఎవరైనా సరే ఉక్కుపాదం మోపుతున్నారు. ఇక వారికి సహకరించే అధికారులను కూడా ఉపేక్షించేది లేదని తేల్చి చెప్తున్నారు. ఇటీవల పలువురు పోలీసులపై ఎన్ ఈ బీ అధికారులపై కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే.

అసెంబ్లీ సమావేశాలకు సమాయత్తం కావాలి: మంత్రి దయాకర్‌రావు

హైదరాబాద్, సెప్టెంబకర్ 5: ఈ నెల 7 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలకు సంబంధించి అన్ని విధాలా సమాయత్తం కావాలని సంబంధిత శాఖ అధికారులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశించారు. శనివారం తన నివాసంలో ఆయా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో అన్ని వివరాలతో అధికారులు సంసిద్ధంగా ఉండాలన్నారు.

మిషన్ భగీరథ, ఉపాధి హామీ, పల్లె ప్రగతి, ఎన్ఆర్ఈజీఎస్ లాంటి అన్ని పథకాల అమలు తీరుపై అధికారులు తగిన సమాచారంతో ఉండాలని ఆయన ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని సమీక్షించి, నివేదిక ఇవ్వాలన్నారు. ఈ సమీక్షలో గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కమిషనర్ రఘునందన్ రావు, అధికారులు పాల్గొన్నారు.

యాసింగి విత్తన సేకరణ దృష్టి సారించండి

-అధికారులకు మంత్రి నిరంజన్ సూచన

హైదరాబాద్,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): గత సంవత్సరం యాసంగికన్నా ఈసారి సాగు పెద్దయెత్తున పెరుగుతుందని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టులు నిండి, చెరువులు అలుగుపారుతున్నాయన్నారు. దీంతో రైతాంగానికి సాగునీరు అందుబాటులో ఉందని మంత్రి చెప్పారు. కాబట్టి యాసంగి విత్తన సేకరణ అధికారులు దృష్టిపెట్టాలని అన్నారు. యాసంగి విత్తన సేకరణ, లభ్యత పై మంత్రుల నివాస సముదాయంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి నిరంజన్‌రెడ్డితో పాటు వ్యవసాయశాఖ కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి, విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, ఎండి కేశవులు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ వేరుశనగ, పప్పుశనగ, వరి విత్తనాల సేకరణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. విత్తన సరఫరాలో సమస్యలు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సెప్టెంబరు నెలలో యాసంగి విత్తనాలు సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రస్తుతం 50వేల క్వింటాళ్ల వేరుశనగ, 73 వేల క్వింటాళ్ల పప్పుశనగ విత్తనం తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ సిద్ధంగా ఉంచిందన్నారు.

బైకును ఢీకొన్న లారీ: చిన్నారి సహా దంపతుల మృతి

చిత్తూరు,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): బైకుపై అత్తారింటికి వెళ్తున్న ముగ్గురు రోడ్డు ప్రమాదంలో కన్నుమూశారు. కేవిపల్లి మండలంలోని గ్యారంపల్లి వద్ద ఈ ప్రమాదం జరిగింది. మృతులు చిన్న గొట్టిగల్లుకు చెందిన

శంకరప్ప, హారిక, చిన్నారి లిల్లీగా పోలీసులు గుర్తించారు. శంకరప్ప హారిక దంపతులు.. తమ రెండేళ్ల చిన్నారితో కలసి అత్తారింటికి బయలుదేరారు. పీలేరు నుంచి బయలుదేరిన కొద్దేసేపటికే మార్గం మధ్యలో గ్యారంపల్లి వద్ద లారీ ఢీకొట్టింది. వైఎస్సార్ కడప జిల్లా రాయచోటి వైపు ఓ మోటార్ బైక్ పై వెళ్తున్న వీరిని అదే మార్గం నుంచి వెళుతున్న ఓ లారీని బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళుతున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఎగిరిపడ్డారు. తీవ్రంగా గాయపడడంతో అక్కడికి అక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నా ప్రయోజనం లేకపోయింది.

పదేళ్లుగా విద్యాహక్కు చట్టం గురించి పట్టించుకోరా?

-ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

హైదరాబాద్,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): విద్యాహక్కు చట్టం అమలుపై పదేళ్ళ నుంచి ఏం చేస్తున్నారని ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. విద్యా హక్కు చట్టం అమలవ